సమగ్ర కథనాలు, ఈ పేపర్ కోసం స్కాన్ చేయండి

ఆదివారం
SUNDAY
8.12.2024
సంచిక: 109
సంపుటి: 16
వెల రూ.6.00
పేజీలు: 8
PAGES: 8
హైదరాబాద్
HYDERABAD

ఋషి

ధర్మం కోసం అక్షర తపస్సు తెలుగు దినపత్రిక

శ్రీకృష్ణుడి మాట

అన్ని పనులకు మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. కర్మ అనుభవించాల్సి ఉంటుంది. అందుకే మంచి కర్మలు చేయాలి.

ముహూర్తం

ఆదివారం శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:38 సూర్యాస్తమయం - సా. 5:38 తిథిజి సప్తమి ఉ. 9:43 వరకు సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం శతభిష మ. 3:52 వరకు యోగం వజ్ర తె. 3:46o వరకు కరణం వనిజ ఉ. 9:43 వరకు విష్టి రా. 8:53 వరకు వర్జ్యం రా. 10:09 నుండి రా. 11:40 వరకు దుర్ముహూర్తం సా. 4:09 నుండి సా. 4:53 వరకు రాహుకాలం సా. 4:15 నుండి సా. 5:38 వరకు యమగండం మ. 12:08 నుండి మ. 1:30 వరకు గుళికాకాలం మ. 2:53 నుండి సా. 4:15 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:02 నుండి తె. 5:50 వరకు అమృత ఘడియలు ఉ. 9:05 నుండి ఉ. 10:38 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:30 వరకు
గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published From HYDERABAD || www.rhushinews.com facebook: rhushinews twitter: rhushinews instagram: rhushinews

ఏపీలో.. అయ్యప్ప మాలాధారులపై దాడి

ఆంధ్రప్రదేశ్‌లోని రాయచోటి (అన్నమయ్య జిల్లా) చెక్ పోస్ట్ వద్ద ఉన్న ఉమామహేశ్వర ఆలయం నుంచి ప్రతి సంవత్సరం మాదిరి ఈ సంవత్సరం కూడా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తుండగా.. ఓ వర్గం ఛాందసవాదులు అయ్యప్ప స్వాముల మీదికి దాడికి దిగారు. గురువారం రాత్రి మసీదు లోపలి నుంచి వందల సంఖ్యలో బయటకు వచ్చి.. అయ్యప్ప స్వాముల బస్సు అద్దాలు ధ్వంసం చేసి, దాడులకు తెగబడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేసినా తగ్గకుండా దీక్షలో ఉన్న స్వాములపై దాడులకు పాల్పడ్డారు. దీంతో అయ్యప్ప స్వాములు కూడా దీటుగా ప్రతిఘటించారు. కాగా.. రాయచోటి పట్టణంలో తరచూ ఇలాంటి దౌర్జన్యాలు జరుగుతున్నాయని పలువురు హిందువులు వెల్లడించారు. సనాతన ధర్మంపై గళమెత్తుతున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఈ ఘటనపై ఎలా స్పందిస్తారో..!

బంగ్లాదేశ్‌లో.. లక్ష్మీనారాయణుడి విగ్రహాలకు నిప్పు

బంగ్లాదేశ్‌లో మత ఛాందసవాదుల ఆగడాలు మరింత ఉధృతం అవుతున్నాయి. బంగ్లా రాజధాని ఢాకాలోని ఇస్కాన్ నంహట్టా సెంటర్‌లో ఉన్న శ్రీశ్రీ లక్ష్మీ నారాయణ్ ఆలయంలోని విగ్రహాలకు నిప్పు పెట్టారు. ఈ ఘటన శనివారం ఉదయం 2-3 గంటల మధ్య జరిగిందని వెస్ట్ బెంగాల్ ఇస్కాన్ ప్రతినిధి రాధామన్ దాస్ వెల్లడించారు. ఈ ఘటనపై హిందూ సంఘాలు మండిపడుతున్నాయి. బంగ్లాదేశ్‌లో నివసించే హిందువులు, ఇతర మైనారిటీలకు రక్షణ లేకుండా పోతోందని.. మత ఛాందసవాదులు ఏ ఆలయం కనిపిస్తే, ఆ ఆలయాన్ని ధ్వంసం చేస్తున్నారని వెల్లడించాయి. భారత ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని హిందూ మైనారిటీలకు అండగా నిలబడాలని కోరతున్నాయి.

ముస్లిం ఓట్ల కోసమే కాంగ్రెస్ 'సంభాల్' నినాదం

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలపై పల్లెత్తు మాట మాట్లాడని కాంగ్రెస్.. ముస్లింల ఓట్ల కోసమే సంభాల్.. సంభాల్.. అని నినదిస్తోంది. బంగ్లాదేశ్‌లో హిందువులపై, ముఖ్యంగా దళితులపై దాడులు జరుగుతన్నాయి. పాక్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయే సమయంలో దళితుల ఆర్తనాదాలను అప్పటి భారత (కాంగ్రెస్) ప్రభుత్వం పట్టించుకోలేదు. కాంగ్రెస్ చేసిన తప్పు అది. అక్కడ దళితులపై జరుగుతున్న దాడులకు కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీయే కారణం. వాళ్లను తిరిగి భారత్‌కు తీసుకొచ్చేందుకు మోదీ సర్కారు కృషి చేయాలి.

- మాయావతి, బీఎస్పీ అధినేత్రి

మాఫియా చేతుల్లోకి బంగ్లాదేశ్ పాలన

బంగ్లాదేశ్ ఇప్పుడు నాయకత్వలేమితో ఉంది. దాంతో పాలన మొత్తం మాఫీయా చేతుల్లోకి వెళ్లిపోయింది. ఆ దేశంతో అతి పొడవైన సరిహద్దును కలిగి ఉన్నందున.. బెంగాల్‌కు ఇబ్బందులు తప్పేలా లేవు. మోదీ సర్కారు వెంటనే చర్యలు ప్రారంభించి.. సరిహద్దు ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు సహకారం అందించాలి.

- మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ సీఎం

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ..

కేసీఆర్‌కు ఆహ్వానం

మాజీ సీఎంను ఆహ్వానించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఈనెల 9న సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాజీ సీఎం కేసీఆర్‌కు ఆహ్వానం అందింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరఫున బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానం అందజేశారు. ముందుగా సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్ హౌస్‌కు చేరుకుని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంత్రి పొన్నం మర్యాదపూర్వకంగా తరువాయి 2 వ పేజీలో...

2

తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుపై వివాదం

రేవంత్ రెడ్డి చర్యను తీవ్రంగా ఖండిస్తున్నా

9న తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టను ఆపాలి

హైకోర్టును ఆశ్రయించిన జూలూరి గౌరీశంకర్

ప్రజల మనోభావాలు దిబ్బతింటాయని పిటిషన్

ప్రతిష్ట నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని వినతి

హైకోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ!

దూకుడు పెంచిన బీఎస్ఎన్ఎల్

ఉచితంగా 500 ఛానెల్స్‌ను వీక్షించేలా ఐఎఫ్‌టీవీ సేవలు ప్రారంభం

5

ప్రధాని మోదీని హత్య చేస్తామని బెదిరింపులు

5

అప్రమత్తమైన పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం

ఇండియా కూటమికి సారథ్యం వహిస్తా

భాగస్వామ్య పక్షాలు కోరితే సిద్ధంగా ఉన్నా

5

మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు

తెలంగాణ సిగలో మరో మణిహారం

మిగులు విద్యుత్తు కలిగిన రాష్ట్రం దిశగా అడుగులు

2025 మార్చినాటికి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి

2,400 మెగావాట్ల విద్యుదుత్పత్తికి సన్నద్ధం

జాతికి అంకితంచేసిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): తెలంగాణ సిగలో మరో మణిహారం చేరింది. విద్యుత్తు సరఫరాలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్‌వన్ స్థానంలో నిలువనుంది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ తో దేశంలో ప్రభుత్వ రంగంలో అతిపెద్ద థర్మల్ విద్యుత్ కేంద్రంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ అవతరించింది. దేశ విద్యుత్ రంగానికి దేశానికి కలికితురాయిగా నిలిచిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను సీఎం రేవంత్ రెడ్డి జాతికి అంకితం చేశారు. కేసీఆర్ కలల ప్రాజెక్టు.. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ రాష్ట్రానికి ఆశాదీపమైంది. రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేసి మిగులు తరువాయి 2 వ పేజీలో...

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ జాతికి అంకితం



2

300కే ఇంటర్నెట్

టి ఫైబర్ ద్వారా ప్రతి ఇంటికి కనెక్షన్

తెలంగాణ ప్రభుత్వం సన్నాహాలు

ఋషి దినపత్రిక కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా పనిచేయుటకు మండలాల వారీగా విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్న యువకులు 9666711515 నంబర్‌కు వాట్సాప్ ద్వారా,
rhushinews@gmail.com
మెయిల్‌కు బయో డేటా పంపగలరు.

నాన్న-సైకిల్

చిన్నవుడు సైకిల్ అంటే ఇష్టం లేనిది ఎవరి కండీ..! మనం ఉన్న చోట నుండి మనం కోరుకున్న గమ్యానికి చేరుకోవడానికి మనకి కొంత ఇష్టం కొంత నైపుణ్యం ఇంకా ధైర్యం ఉండాలనీ మొట్ట మొదటిగా జీవిత పాఠం నేర్పిన వాటిల్లో సైకిల్ కూడా ఒకటి. పొద్దున లేవగానే ఇంట్లో నాన్న సైకిల్ బయటకి తీస్తున్నప్పుడు సైకిల్ బెల్ సౌండుకు మెలుకువ వస్తుంది. ఇంత రాత్రి అయ్యింది నాన్న ఇంకా రాలేదు అన్న మన ఆతృతకి నాన్న సైకిల్ బెల్ మోగగానే సౌండ్ కి హాయిగా నిద్ర పట్టేది అప్పట్లో. ఇప్పుడు అలారం పెట్టుకున్నా మెలకువ రాదు ఒకవేళ వచ్చిన అలారం ఆఫ్ చేసి మళ్ళీ పడుకుంటాం. సైకిల్ కుడా ఎంత ఉపయోగపడేదో చూడండి. నాన్న ఎంత దూరం అయిన సునాయాసంగా ఊరంత పలకరిస్తూ అన్ని పనులను చేస్కోని వచ్చిన కూడా అలసట, ఆయసం ఉండేది కాదు.



కానీ.. ఇప్పటి రోజులు మరి..! కాలం మారింది కదా తక్కువ సమయంలో పని పూర్తి ఐపోవాలి కదా మనకు బైక్లు, కార్లు వచ్చినాయి కదా వాటితో అలసట ఆయసం ఎపాటి? అప్పట్లో ఊహించని అన్నీ రోగాలు ఇప్పట్లో బంపర్ అఫర్లు గా వస్తున్నాయి కదా. ఇప్పుడు తేగేసి డాక్టర్లు సైకిల్ తొక్కాలి అని చెప్పినా, మనకు అంత సమయం, ఓపిక లేవు. ఎందుకంటే అది నామోషి మరియు ఇప్పుడది అన్నిటికన్నా పెద్ద రోగం కాబట్టి. బడికి పోవడానికి లేట్ ఐతే నాన్న సైకిల్ మీద హాయిగా ముచ్చట్లు చెప్తూ మధ్యలో పల్లిపట్టిలకో, వేలికి తోడిగే పాపడాలకో దుకానంలో ఆగి కొనించుకొని మరీ ఆడుకుంటూ పాడుకుంటూ నాన్న బడి లోపలకి తొలించి ఒచ్చేటోడు. మరి ఇప్పుడు, మన పిల్లల్ని పెద్ద స్కూళ్లలో, పెద్ద బ్యాగులు,స్నాక్స్ బ్యాగులు వేసి గబగబా స్కూలు వ్యాను లేద ఆటో మాట్లాడి బై...బై... అని పంపిస్తున్నాం.ఇప్పటి పిల్లలకి ఆస్తమాలు,ఊబకాయలు అదేం గొరమో చక్కర వ్యాధులు కూడా వస్తున్నాయంట. బడి ఐపోయినంక బయటకి రాంగనే అనుకోకుండా నాన్న అటు సైకిల్ మీద ఎవరితోనో మాట్లాడుకుంటూ కనిపిస్తే చాలు, ఉరికురుకి దగ్గరకు వెళ్ళేది. ఆహా.. ఆ సంతోషమే వేరు. మళ్లీ హాయిగా నాన్నతో ఇంటికి వెళ్ళొచ్చు కదా అని. నాన్న కూడా సంతోషంగా దగ్గరకు తీస్కోని బ్యాగ్ ను సైకిల్ హ్యాండిల్‌కి వేస్కోని బుజం మీద ఉన్న తువ్వాల కూర్చుంటే మెత్తగా ఉండాలని మలిచి పెట్టి సిటు మిధ వేసి కూర్చోబెట్టుకొని మళ్లి మధ్యలోనే ఒక ఆశ చాకలెట్ తో, రసగుల్లాలనో కొనించుకొని ఇంటికి తోల్కొని పోయేది. అది ఎంతో నిమ్మలం అయ్యేది.

ఇప్పుడు తల్లిదండ్రుల ఉరుకుల పరుగుల జీవితంలో వాళ్ళ ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ ఉద్యోగాల్లో పడి పిల్లల్ని స్కూల్ నుంచి పికప్ చేస్కునే సమయం కుడా కుదరక పాపం పిల్లలు అదే పెద్ద పెద్ద బ్యాగ్ లు వేసుకొని కూర్చోవటానికి ప్లేస్ లేకుండ ఒకళ్ళ పైన ఒకలు మళ్లి ఇలానే వెళ్లాలా...? మమ్మీ డాడీ ఎవరో ఒకరు వచ్చి పిక్ చేసుకుంటే బాగుండు అని పాలిపోయిన మొహలతో విసుగ్గా పిల్లలు ఇంటికి వస్తున్నారు. సంపాదన తక్కువ ఉన్న ఆ కోద్ది సంపదతో ఆ రోజుల్లో ప్రేమలు అప్యాయతలే వేరు. పిల్లలకి పెద్దలకి ఆరోగ్యం ఎలాంటి రసాయనాలు లేని పండ్లు కురగాయలు ఆ రోజుకి ఆ రోజు సొంతంగా మన పొలాల్లో పండించినవే. అమ్మ నో,తాత నో, నాయనమ్మ నో పొద్దు గుకగానే కాయ గూరలు తెచ్చేవాళ్ళు. అపుడపుడు బడి ఎగ్గొట్టి మరీ పొలాల్లో ఎండవాన లెక్క సెయ్యకుండ చెట్లలో పుట్టల్లో తిరిగి ఏ కాలం లో వచ్చే పండ్లు ఆ కాలం లో నోటి పండ్ల తోనే కోరికి తినుకుంట ఆడుకుంట పాడుకుంట పొలం ఎంత దూరం లో ఉన్నా నడుచుకుంటూ ఇంటికి వచ్చేవాళ్లం. ఇగ చక్కర ఛాయాపత్త సబ్బులు మాత్రమే ఊరికి ఒకటీ రెండో ఉన్నా కోమటోళ్ల దుకండ్లలో పావో చేటాకో కొనుకునే టోళ్లం అప్పటికప్పుడు. ఇప్పుడు సంపద ఎక్కువ కాని ప్రేమలు అప్యాయతలు తక్కువ. ఇప్పుడు అనారోగ్యం ఎంత కర్చు పెట్టినా సరియైన తిండి దొరకట్లేదు.

- శైలజ (తండ్రి లక్ష్మయ్య)

పాక్ కోసం బంగ్లా వీసా రూల్స్ సరళం

ఢాకా, డిసెంబర్ 7: పాకిస్థాన్ పంచన చేరేందుకు ఉవ్విళ్లూరుతున్న బంగ్లాదేశ్.. ఆ దేశం కోసం మరో ముందడుగు వేసింది. బంగ్లాదేశ్‌కు రావాలనుకునే పాకిస్థానీ పౌరులకు సెక్యూరిటీ క్లియరెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సరిహద్దు సమస్యల నేపథ్యంలో 2018లో హసీనా సర్కారు.. పాక్ పౌరుల వీసాకు సెక్యూరిటీ క్లియరెన్స్‌ను కచ్చితం చేసింది. దాన్ని యూనస్ సర్కారు తొలగించింది. బంగ్లా ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య భారత్‌కు మరింత ఇబ్బందికరంగా మారే ప్రమాదం ఉంది.

తెలంగాణ సిగలో మరో మణిహారం

మొదటి పేజీ తరువాయి

విద్యుత్తు కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టింది. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణాన్ని తెలంగాణ జెన్కో చేపట్టింది. నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఐదు యూనిట్లకు జూన్ 26, 2017న కేంద్ర పర్యావరణ శాఖ అనుమతినిచ్చింది. అదే ఏడాది అక్టోబరు 17న రూ.29 వేల కోట్ల అంచనా వ్యయంతో జెన్ కో నిర్మాణం ప్రారంభించి.. భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బీహెచ్ఇఎల్)కు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. పవర్ ప్లాంట్ నిర్మాణం అనుకున్న గడువుకన్నా రెండేళ్లు అదనం కావడంతో అంచనా వ్యయం రూ.29,500 కోట్ల నుంచి రూ.34,500 కోట్లకు పెరిగింది. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగాయి. ఒకవైపు పనులు ఊపందుకుంటున్న సమయంలోనే ప్లాంట్ నిర్మాణంలో ప్రభుత్వం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది. ఈ ప్లాంట్ లో 50 శాతం దేశీయ బొగ్గును, 50 శాతం విదేశీ బొగ్గును వినియోగించాల్సి ఉండగా, దానికి విరుద్ధంగా నూటికి నూరు శాతం దేశీయ బొగ్గును వినియోగించనుందని రెండు స్వచ్ఛంద సంస్థలు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (%చీ+%)కి ఫిర్యాదు చేశాయి. దీంతో ఎన్జీటి యాదాద్రి పవర్ ప్లాంట్ రెండో దశ నిర్మాణానికి పర్యావరణ అనుమతులను నిలిపివేసింది. మరోవైపు కరోనా మహమ్మారితో 10వేల మంది కార్మికులు స్వరాష్ట్రాలకు వెళ్లిపోవడంతో రెండేళ్ల పాటు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారి కాంగ్రెస్ సర్కార్ ఏర్పడింది. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి ఎన్జీటీ క్లియరెన్స్‌ను తీసుకోవడంతోపాటు, ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యుత్ ఉత్పత్తికి ఏటా అవసరమయ్యే 3.5 టీఎంసీల నీటిని టెయిల్ పాండ్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి 22 కిలోమీటర్ల పైపు లైన్ తో చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. బొగ్గు రవాణా కోసం సమీపంలో జాన్‌పహాడ్ రైల్వే క్రాసింగ్ నుంచి ప్లాంట్ వరకు రూ.100 కోట్ల వ్యయంతో 8కి.మీ రైల్వేలైన్ నిర్మించారు. ప్రతిరోజు ప్లాంట్‌కు అవసరమయ్యే 50 వేల టన్నుల బొగ్గును రామగుండం నుంచి యాదాద్రి పవర్ ప్లాంట్ కు తరలిస్తున్నారు. దక్షిణాదిలో ప్రభుత్వ రంగంలో అతిపెద్దదైన యాదాద్రి పవర్ ప్లాంట్.. మొదటి, రెండో యూనిట్ల నుంచి పూర్తి స్థాయిలో కాంతులు విరజిమ్మనుంది. ప్లాంట్ పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సందర్శించి అధికారులతో ఎప్పటికప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్షిస్తున్నారు. దశలవారీగా విద్యుత్ ఉత్పత్తిని చేపట్టి గ్రిడ్ కు అనుసంధానం చేసేందుకు మార్గం సుగమమైంది. హైటెన్షన్ విద్యుత్‌లైన్ టవర్ల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ నెలాఖరులోగా మూడు యూనిట్లలో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసే లక్ష్యంతో అధికారులు పనులను యుద్ధ ప్రాతిపదికన పురోగతి సాధిస్తున్నారు. అందులో భాగంగానే మొదటి, రెండవ యూనిట్లలోని యాక్సిలరీ బాయిలరల్లో లైట్ అప్ చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. బొగ్గుకు ప్రత్యామ్నాయంగా ఇంధనాన్ని ఉపయోగించి అధికారులు ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. 275 మీటర్ల ఎత్తు గల చిమ్ని ద్వారా వాయువును విడుదల చేస్తూ ట్రయల్ రన్ లో భాగంగా ప్రాథమిక పరీక్షలను పూర్తి చేశారు. ప్లాంట్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తి కావడంతో విద్యుత్ కాంతలు పంచేందుకు పవర్ ప్లాంట్ సిద్ధమైంది. ప్లాంటుకు అనుసంధానంగా రైల్వేలైన్లు పూర్తికావడంతో ప్లాంట్ ద్వారా తెలంగాణకు 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) రూ.928.52 కోట్ల అంచనాతో ఈ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిపను నిర్మించనుంది. మొత్తం 3,52,771.02 చ.మీ.ల విస్తీర్ణంలో ఈ టౌన్‌షిప్ నిర్మాణం జరగనుండగా, 2,21,903.67 చ.మీ.ల విస్తీర్ణంలో నివాస గృహ సముదాయాలతో టౌన్ షిప్ ను నిర్మించనున్నారు. పవర్ ప్లాంట్ పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించే 2025 మార్చి నాటికి వేల సంఖ్యలో ఇంజనీరింగ్ అధికారులు, ఉద్యోగులు, ఇతర కార్మికులు ఇక్కడ రాత్రింబవళ్లు పనిచేయనున్నారు. వీరంతా తప్పనిసరిగా స్థానికంగా నివాసం ఉండాల్సి రావడంతో టౌన్‌షిపను జెన్‌కో నిర్మిస్తోంది. 11 అంతస్తుల బహుళ అంతస్తుల సముదాయాల్లో ఈ క్వార్టర్లు ఉండనున్నాయి. మరోవైపు కేసీఆర్ కలల ప్రాజెక్టు.. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ రాష్ట్రానికి ఆశాదీపం కానుంది. వివిధ రాష్ట్రాలు, సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు ముగియనున్న నేపథ్యంలో ఆ లోటును భర్తీ చేసేందుకు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఆశాదీపం కానున్నది. రాష్ట్ర విద్యుత్తు అవసరాల కోసం ఇతర రాష్ట్రాల పవర్ ప్లాంట్లతో చేసుకున్న కీలక ఒప్పందాల గడువు రెండు, మూడేండ్లలోనే ముగియనుంది. 2024- 25లో 2,284 మెగావాట్లు, 2025 -26లో 2,400 మోగావాట్ల విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు ముగుస్తాయి. వీటితో పాటు మరో 2,899 మెగావాట్ల సోలార్ విద్యుత్తు వినియోగ ఒప్పందాలు సైతం ముగియనున్నాయి. రామగుండం యూనిట్ -7కు చెందిన 87.76 మెగావాట్ల ఒప్పందం 2026 -27లో ముగియనుంది. 2028-29లో 583.9 మెగావాట్ల సింహాద్రి ఒకటో దశ ఒప్పందం ముగియనుండగా, అదే ఏడాదిలో వెయ్యి మెగావాట్ల ఛత్తీస్‌గఢ్ ఒప్పందం గడు వు సైతం 2028-29లో ముగియనుంది. ఈ నేపథ్యంలో యాదాద్రి పవర్ ప్లాంట్ రాష్ట్రాన్ని విద్యుత్తు కష్టాల నుంచి బయట పడేయనుంది. ప్లాంట్ లోని 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన రెండవ యూనిట్ ను సీఎం రేవంత్ రెడ్డి విద్యుత్ గ్రిడ్ కు అనుసంధానం చేసి ప్లాంటును జాతికి అంకితం చేశారు. ఈ నెలాఖరు నాటికి మూడు యూనిట్ల ద్వారా 2,400 మెగావాట్ల విద్యుదుత్పత్తిని ప్రారంభించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మిగతా రెండు యూనిట్లను మార్చి 2025 నాటికి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసి రాష్ట్రానికి వెలుగులు విరజిమ్మేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి ఉన్నారు.

రూ.300కే ఇంటర్నెట్

టి ఫైబర్ ద్వారా ప్రతి ఇంటికి కనెక్షన్.. తెలంగాణ ప్రభుత్వం సన్నాహాలు

హైదరాబాద్,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): ఇకపై తెలంగాణలో అత్యంత చౌకగా ఇంటర్నెట్ సేవలు లభించనున్నాయి. టి ఫైబర్ ద్వారా ప్రతి ఇంటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. ఈ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంటర్నెట్ కనెక్షన్‌ను ప్రభుత్వం రూ.300కే ఇవ్వనుంది. ఈ కనెక్షన్ ద్వారా ప్రతి ఇంట్లో ఉన్న టీవీని కంప్యూటర్ మాదిరిగా వినియోగించుకోవచ్చు. దీని ద్వారా టీవీలోనే ప్రత్యేక వెసులబాటును కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. 20 ఎంబిబిఎస్ స్పీడ్‌తో ఇంటర్నెట్ కనెక్షన్ అందివ్వనుంది ప్రభుత్వం. ఇందులో పలు తెలుగు ఓటీటీలు కూడా అందుబాటులో ఉంటాయి. మొదటి దశలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 2096 కి పైగా గ్రామపంచాయతీలో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. వీటితోపాటు 30 వేలకు పైగా ప్రభుత్వ సంస్థలను అనుసంధానించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు టీ ఫైబర్ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. తొలి దశలో తెలంగాణలోని పలు జిల్లాలలో టీ ఫైబర్ ట్రయల్ సేవలను ప్రారంభించనుంది. సీఎం రేవంత్ రెడ్డి మీదగా టీ ఫైబర్ ట్రైల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్

సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకునే విధంగా ఈ తరహా పథకానికి శ్రీకారం చుట్టారు. సాధారణ స్పీడ్ తో పాటు హై స్పీడ్ సేవలను సైతం గ్రామీణ స్థాయి ప్రజలకి ప్రభుత్వం అందించనుంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం భారత్ నెట్ పేరుతో ఈ పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం టి ఫైబర్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు అత్యంత తక్కువ ధరకు ఇంటర్నెట్ సేవలను అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. తొలి దశలో నారాయణపేట, సంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాలోని పలు గ్రామాలకు ఈ ట్రయల్ సేవలను అందించనున్నారు%%ఈ నెల 8 న సీఎం రేవంత్ రెడ్డి ఈ సేవల్ని ప్రారంభించనున్నారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ.. కేసీఆర్‌కు ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి

కలిశారు. అనంతరం ఆహ్వాన పత్రిక ఇచ్చి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈనెల 9న జరిగే కార్యక్రమానికి తప్పకుండా రావాలంటూ పిలిచారు. ప్రజాపాలన విజయోత్సవాలు, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భారాస అధినేత కేసీఆర్‌ను ప్రభుత్వం ఆహ్వానించింది. హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్.. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను, దిల్‌కుషా అతిథిగృహంలో కిషన్‌రెడ్డిని కలిసి ఉత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానపత్రాలు అందజేశారు. అనంతరం ఎర్రవెల్లికి వెళ్లి మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్‌ను ఆహ్వానించారు. మంత్రి వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ సలహాదారుడు హర్కర వేణుగోపాల్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ ఉన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుపై వివాదం

- రేవంత్ రెడ్డి చర్యను తీవ్రంగా ఖండిస్తున్నా
- 9న తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టను ఆపాలి
- హైకోర్టును ఆశ్రయించిన జూలూరి గౌరీశంకర్
- ప్రజల మనోభావాలు దిబ్బతింటాయని పిటిషన్
- ప్రతిష్ట నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని వినతి
- హైకోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ!

హైదరాబాద్, డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): తెలంగాణ తల్లి విగ్రహ వివాదం ముదురుతూనే ఉంది. బతుకమ్మ లేకుండా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై మేధావులు గళం విప్పుతున్నారు. రేవంత్ రెడ్డి చర్యను తీవ్రంగా ఖండిస్తున్నారు. నూతన తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై ప్రముఖ రచయిత జూలూరి గౌరీ శంకర్ హైకోర్టును ఆశ్రయించారు. డిసెంబర్ 9న సచివాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టను ఆపాలని పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులను తెలంగాణ ప్రజలు,

మేధావులు, రచయితలు,కవులు, కళాకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విగ్రహంలో మార్పులు అంటే తెలంగాణ అస్తిత్వం జరుగుతున్న దాడిగా తెలంగాణ సమాజం భావిస్తుంది. తెలంగాణ తల్లి విగ్రహం రూపం మార్చడంతో రాష్ట్ర ప్రజల మనోభావాలు దెబ్బతింటాయని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ పిల్ ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈనెల 9న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సచివాలయం ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిన రోజు, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ పుట్టినరోజు కావడంతో ఆ సందర్భాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలని నిర్ణయించింది. అచ్చమైన తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా మన తెలంగాణ తల్లి విగ్రహం ఉందని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కాగా, రాష్ట్ర సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ పండుగను సూచించే పాత విగ్రహాన్ని మార్చి, కాంగ్రెస్ తల్లి విగ్రహం పెడుతున్నట్లుగా ఉందని బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. అచ్చమైన తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ఉంది. అందులో మీరు ఈ లక్షణాలు గుర్తించాలి 1. తెలంగాణ ఆడబిడ్డల కట్టు, బొట్టు ఉట్టిపడేలా ప్రసన్న వదనంతో ఉండే నిండు రూపం. 2. చూడగానే తెలంగాణ తల్లి మన ఇంటి ఆడబిడ్డ అవతారం ఎత్తినట్లుగా కనిపించే ముఖం. 3. మెడలో బంగారు తీగ – ఎన్ని ఆభరణాలున్నా, తెలంగాణ ఆడబిడ్డలు మెడలో ఈ తీగను తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబంగా, ఎంతో ఇష్టంగా ధరిస్తారు. 4. కుడి చేతితో తెలంగాణ ప్రజలకు అభయహస్తం చూపుతూ, ఎడమ చేతిలో తెలంగాణలో పండించే ముఖ్యమైన పంటలను ధరించి, రాష్ట్రంలో వ్యవసాయానికి గల ప్రాముఖ్యతను చాటి చెబుతుంది. తెలంగాణ గ్రామీణ జీవన విధాన ప్రాముఖ్యతను, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి మూల స్తంభమైన వ్యవసాయంలో ఆడబిడ్డల ప్రాముఖ్యతను చాటుతోంది 6. వస్త్రధారణలోని ఆకుపచ్చని రంగు పచ్చని పంటలను, ఎరుపు రంగు చాకలి ఐలమ్మలాంటి తెలంగాణ ధీర వనితల పోరాటానికి సంకేతం. 7. తెలంగాణ తల్లిని బిడ్డలందరూ తమ గుండెల్లో పెట్టుకొని చూసుకుంటున్నట్లుగా తెలిపే విగ్రహ పీఠం. 8. విగ్రహ పీఠంలో, తెలంగాణ తల్లికి దాస్య విముక్తి కల్పించిన తెలంగాణ బిడ్డల పోరాటాలకు ప్రతీకగా బిగిసిన పిడికిళ్లు. 9. రాష్ట్రంలోని సబ్బండ వర్గాలకు ప్రతిరూపంగా తెలంగాణ తల్లి విగ్రహం.

కేసీఆర్ ఏనాడైనా ప్రతిపక్ష పాత్రను పోషించారా?

గెలిస్తే ఉప్పొంగడం.. ఓడితే కుంగిపోవడమా కేసీఆర్?.. కేసీఆర్ స్థాయికి కుంగిపోవడం తగదు

ఓడిపోగానే ఫాంహౌస్‌కు వెళ్లిపోయారు

కేసీఆర్ గాలి బ్యాచ్‌ను తమ పైకి వదిలి వెళ్లారు

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

నల్గొండలో కాంగ్రెస్ విజయోత్సవ సభ నిర్వహణ

మీరు దొంగల బండి ఎక్కితే మీపై ఉన్న గౌరవం పోతడి

కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్‌కు సూచన

బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

నల్గొండ,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): ఈ ఏడాది కాలంలో కేసీఆర్ ఏనాడైనా ప్రతిపక్ష నేతగా తన పాత్రను పోషించారా? బీఆర్ఎస్ హయాంలో తమ ఎమ్మెల్యేలను లాక్కుంటే వెనుకడుగు వేయకుండా పోరాడామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గెలిస్తే ఉప్పొంగిపోవడం... ఓడితే కుంగిపోవడం కేసీఆర్ స్థాయికి తగదన్నారు. తాను గతంలో ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పటికీ ప్రజల్లోనే ఉండి ఎంపీగా గెలిచానన్నారు. కానీ కేసీఆర్ ఒక్కసారి ఓడిపోతే కుంగిపోయి ఫాంహౌస్‌లోకి వెళ్లారని ఎద్దేవా చేశారు. నల్గొండలో నిర్వహించిన కాంగ్రెస్ విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ గాలి బ్యాచ్‌ను తమ పైకి వదిలి వెళ్లారని మండిపడ్డారు. ప్రభుత్వం ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా వద్దంటున్నారని, అలా చేస్తే తెలంగాణ ముందుకు ఎలా వెళుతుందని ప్రశ్నించారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా నిధులు వేస్తామని... రైతుల ఖాతాల్లో డబ్బులు పడుతుంటే బీఆర్ఎస్ నేతల గుండెలు లబ్‌డబ్ అంటూ కొట్టుకోవాలన్నారు. రైతులు సన్నాలు పండించాలని విజ్ఞప్తి చేశారు. ఎయిర్ పోర్టుకు కూతవేటు దూరంలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. మూసీ ప్రక్షాళన చేస్తానంటే బీఆర్ఎస్ నాయకులు వద్దంటున్నారని, కానీ అనుభవం కలిగిన కేసీఆర్ ఈ అంశంపై తన వైఖరిని చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రక్షాళన వద్దంటే బొంద పెడతారని హెచ్చరించారు. బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్‌కు తాను ఒక్కటే మాట చెబుతున్నానని, మీరు మారాలని, ఆలోచన చేయాలని సూచించారు. ఆ దొంగల దోస్తీ చేస్తే... ఆ దొంగల మాటలు పట్టుకుంటే మీరు కూడా అలాగే తయారవుతారన్నారు. మీరు దొంగల బండి ఎక్కితే మీపై ఉన్న గౌరవం కూడా పోతుందన్నారు. ఏడాది పాలనలోనే తాము రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, ప్రధాని మోదీ కానీ, కేసీఆర్ కానీ అలా చేశారా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో నల్గొండ పాత్ర మరువలేనిదన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకున్న శ్రీకాంతచారి నల్గొండ జిల్లాకు చెందిన వాడేనన్నారు. నల్గొండలో అడుగుపెట్టినప్పుడు సాయుధ రైతాంగ పోరాటం గుర్తుకువస్తుందన్నారు. నల్గొండలో కృష్ణాజలాలు ప్రవహిస్తే ఫ్లోరైడ్ సమస్య తీరుతుందని ప్రజలు భావించారన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులు కేసీఆర్ హయాంలో నిలిచిపోయాయని విమర్శించారు. ఉమ్మడి ఏపీ పాలనలో కంటే కేసీఆర్ పాలనలోనే నల్గొండకు ఎక్కువ అన్యాయం జరిగిందని మండిపడ్డారు. నల్గొండకు కృష్ణా జలాలు తీసుకొచ్చి నేలను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. వరి వేస్తే ఉరేసుకున్నట్లేనని కేసీఆర్ గతంలో అన్నారని, కానీ తాము మాత్రం మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇచ్చామన్నారు. మూడ్రోజుల్లోనే రైతులకు ధాన్యం డబ్బులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. అత్యధిక ధాన్యాన్ని ఉత్పత్తి చేసి తెలంగాణ రికార్డ్ సృష్టించిందన్నారు. నల్గొండ జిల్లా భూముల్ని తడిపేందుకు కృష్ణమ్మ బిరబిరా తరలివచ్చే తరుణం ఆసన్నమైంది. 17 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత.. నార్కట్‌పల్లిలోని బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం ప్రారంభానికి సిద్ధమైంది. నల్గొండ జిల్లాలోని 4 నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరందించే ఈ ప్రాజెక్టును.. సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదాద్రి థర్మల్ స్టేషన్ లోని 800 మెగా వాట్ల యూనిట్ -2 ను ప్రారంభించి జాతికి అంకితం ఇచ్చారు. ఈ నేపథ్యంలో అక్కడి ఫోటో ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం రేవంత్ భట్టి విక్రమార్క, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, ఎంపీ రఘువీర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నల్గొండ, నకిరేకల్, మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు సాగు నీరందించడమే కాదు.. 107 గ్రామాలకు తాగునీరందించే ఈ ప్రాజెక్టుకి.. ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తయింది. 2 మోటార్ల ద్వారా రిజర్వాయర్‌లో 70 శాతం నీటిని నింపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టుని ప్రారంభించడంతో పాటు రిజర్వాయర్ దగ్గర ప్రత్యేక పూజలు చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

ఏటా రూ. 20వేల కోట్ల వడ్డీలేని రుణాలు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్,డిసెంబర్7(ఋషి ప్రతినిధి): మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని... ఇందులో భాగంగానే ఏటా రూ. 20వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల మేర రుణాలు మహిళలకు ఇవ్వాలని నిర్దేశించుకున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పర్యాటక భవన్‌లో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి భట్టి విక్రమార్క ప్రారంభించారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు చెందిన ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన స్టాళ్లు పరిశీలించిన భట్టి.. అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. భవిష్యత్తులో అవి మధ్య, భారీ పరిశ్రమలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గ్రామీణ మహిళల్లోనూ వ్యాపారదక్షత ఉంటుందని.. పర్యావరణానికి హాని కలగకుండా చేసే ఉత్పత్తులను ఆదరించాలని భట్టి కోరారు.

పోరాటమే ఊపిరిగా ముందుకు సాగుతా

ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ ఆసక్తికర పోస్ట్

హైదరాబాద్,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయాక,కాంగ్రెస్ గెలవడం.. ఆపై రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించడం ఏడాది పూర్తి చేసుకుంది. రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ కొలువు తీరింది. ఈ సందర్భంగా మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి నవంబర్ 14వ తేదీ నుంచి మొదలు సోనియా గాంధీ పుట్టిన రోజు డిసెంబర్ 9వ తేదీ వరకు.. ప్రజా విజయోత్సవాలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించింది. ఈ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా జరుపుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా సీఎం రేవంత్ ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 'పోరాటాలను, ఉద్యమాలను, త్యాగాలను.. ఆత్మబలిదానాలను, ఆకాంక్షలను, ఆశయాలను అన్నింటినీ కలిపి వీలునామాగా రాసి డిసెంబర్ 7, 2023 నాడు. తెలంగాణ నా చేతుల్లో పెట్టింది.

అంబేడ్కర్ వర్సిటీ వీసీగా ఘంటా చక్రపాణి

గవర్నర్ ఆమోదంతో ఉత్తర్వులు జారీ

మూడేళ్లపాటు కొనసాగనున్న ఘంటా

సీఎంను కలిసిన ఘంటా చక్రపాణి

హైదరాబాద్,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గా సీనియర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి నియమితులయ్యారు. ప్రభుత్వ సిఫారసుతో ఆయన నియామకానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదముద్ర వేశారు. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. దీంతో కరీంనగర్ జిల్లా వాసికి అరుదైన గౌరవం దక్కినట్లయింది. సీనియర్ ఆచార్యు లైన ఆయనకు సమున్నత పదవిలో బాధ్యతలు చేపట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఉమ్మడి జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివాదరహితుడిగా పేరొందిన చక్రపాణి గత ప్రభుత్వ హయాంలోనూ టీఎస్పీఎస్సీ చైర్మన్ గా తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించడంతో దూరవిద్యకు సేవనందించే అవకాశం లభించినట్లైంది. చక్రపాణి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం 2014 నుంచి 2020 వరకు తొలి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) చైర్మన్ గా పని చేశారు. కరీంనగర్ సమీపంలోని ఎల్ఎండీ నిర్మాణంలో మునిగిన యాస్వాడ గ్రామంలో ఘంటా జన్మించారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం దూళికట్టలో స్థిరపడ్డారు. యాస్వాడ, ఎలగందల్, రామగుండం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్యనభ్యసించారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి, ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్లారు. ఓయూలో ఎంఏ, పీహెచ్ఎ సోషియాలజీ, ఎంసీజే చేశారు. 1985లో జీవగడ్డ దినపత్రికలో పాత్రికేయుడిగా ప్రవేశించి, ఆ తర్వాత పలు పత్రికల్లో రిపోర్టర్ గా, సబ్‌ఎడిటర్ గా పని చేశారు. 1990లో టీచింగ్ వైపు మళ్లారు. కాకతీయ యూనివర్సిటీలో సోషియాలజీ ప్రొఫెసర్ గా చేరారు. 1994లో అంబేడ్కర్ యూనివర్సిటీలో సోషియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గా చేరి, 2009లో ప్రొఫెసర్గా పదోన్నతి పొందారు.తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేశారు. పలు సామాజిక అం శాలపై అధ్యయనాలు, రచనలు, విశ్లేషణలతో తెలంగాణ సమాజానికి సుపరిచితులుగా మారారు. 2004లో డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నక్సల్స్ తో జరిపిన శాంతి చర్చల సందర్భంగా పీస్ ఇనిషియేటివ్ కమిటీ వ్యవస్థాపకుల్లో ఘంటా ఒకరు. కాల్పుల విరమణ కమిటీకి ఆయన కన్వీనర్ గా పని చేశారు. వీసీగా చక్రపాణి నియామకంపై ఉమ్మడి జిల్లావాసులు హర్షం వ్యక్తం. చేస్తున్నారు.ఘంటా చక్రపాణి కే కాకుండా గతంలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులకు కీలక పదవులు లభించాయి. వేములవాడ మండలం హన్మాజీపేటకు చెందిన డా.సి.నారాయణ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వీసీగా పని చేశారు. ఇదే మండలం మల్లారం గ్రామానికి చెందిన జి. రాంరెడ్డి దూరవిద్య పితామహుడుగా పేరు ఉంది.

స్కూల్ బాత్‌రూంలో యాసిడ్

రక్తపు వాంతులు చేసుకున్న విద్యార్థులు

చింతల్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో ఘటన

హైదరాబాద్,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): హైదరాబాద్ నగరంలోని చింతల్ లో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మూడో అంతస్తులో ఉన్న బాత్ రూంలో కిందపడిన యాసిడ్ బాటిల్ ఘాటు వాసన రావడంతో విద్యార్థులు రక్తపు వాంతులు చేసుకున్నారు. తల్లిదండ్రులకు తెలియకుండా విద్యార్థులను స్కూల్ యాజమాన్యం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించింది.

సకాలంలో స్పందించి వైద్యం అందిం చడంతో విద్యార్థులు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియడంతో పాఠశాల ముందు వారు ఆందోళనకు దిగారు. ఈ ఘటనతో పాఠశాలలో ఉన్న విద్యార్థులను శ్రీ చైతన్య యాజమాన్యం ఇంటికి పంపించింది. 40 నుంచి 50 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతానికి పల్స్ ఆసుపత్రిలో కొందరు విద్యార్థులు చికిత్స పొందుతున్నారు. మరికొంద మంది విద్యార్థులను ప్రాణాధార ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. పాఠశాల ముందు ఏబీవీపీ విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనకు దిగారు.విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం, కుత్బుల్లాపూర్ లోని చింతల్ శ్రీ చైతన్య పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉదయం 10.30 గంటల ప్రాంతంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

మీ పోరాటానికి అండగా ఉంటాం

ప్రభుత్వం వేధింపులను మానుకోవాలి

లగచర్ల బాధితుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం

అసెంబ్లీ సమావేశాల్లో లగచర్ల అంశం లేవనెత్తుతాం

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): వికారాబాద్ జిల్లాలోని లగచర్ల భూసేకరణ బాధితులు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని తెలంగాణ భవన్లో కలిసి, తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. తనను కలిసిన ఫార్మా సిటీ భూ సేకరణ బాధితుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పోరాటంలో వారికి అండగా ఉంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వేధింపులను మానుకొని బాధితుల డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. లగచర్లలో భూసేకరణ రద్దు అయ్యేదాకా తమ పార్టీ ప్రజల పక్షాన నిలబడుతుందని, ఈ పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ వారికి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన భూసేకరణ బాధితులపై అన్యాయంగా పెట్టిన కేసులన్నింటినీ భేషరతుగా వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పోలీసుల ద్వారా బాధిత కుటుంబాలను వేధించడం మానుకోవాలన్నారు. ప్రజలకు అండగా ఉండాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఇలా చేయడం తగదన్నారు. వికారాబాద్ జిల్లా ఎస్పీకి ఫోన్ చేసిన మాట్లాడిన కేటీఆర్, బాధితులపై పెట్టిన అక్రమ కేసుల పేరుతో పోలీసు వేధింపులను నిలిపివేయాలని కోరారు.అసెంబ్లీ సమావేశాల్లో లగచర్ల భూ సేకరణ బాధితుల డిమాండ్లను లేవనెత్తుతామని కేటీఆర్ తెలిపారు. భూముల కోసం న్యాయమైన పోరాటం చేస్తున్న బాధితులపై అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. గిరిజనులు, పేద రైతుల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ బాధితుల తరఫున నిలబడుతుందని స్పష్టం చేశారు. లగచర్ల బాధితులు చేసిన పోరాటంకు తలవంచి ప్రభుత్వం దిగి వచ్చిందని, నోటిఫికేషన్ రద్దు చేసుకుందన్నారు. కానీ మరోసారి అవే భూములను పారిశ్రామిక కారిడార్ పేరుతో సేకరించడం మానుకోవాలని, నోటిఫికేషన్‌ను పూర్తిగా రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజల అభ్యర్థనల మేరకు ప్రభుత్వం ఇకనైనా నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన భూములను వదిలి, సీఎం రేవంత్ రెడ్డి కుటుంబానికి చెందిన వెల్దండలో ఉన్న 500 ఎకరాల భూములను సేకరించి ఫార్మా పరిశ్రమల కోసం ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. గిరిజనుల భూములు గుంజుకోవడం రేవంత్ రెడ్డి సర్కార్ దుర్మార్గానికి నిదర్శనమని మండిపడ్డారు. జైల్లో ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి వంటి వారి తరఫున, అక్రమంగా కేసులతో జైల్లో ఉన్న బాధితుల తరఫున, న్యాయపోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం లగచర్లలో ఫార్మాసిటీ కోసం భూముల సేకరణ మొదలుపెట్టింది. ఈ క్రమంలో లగచర్లకు వచ్చిన వికారాబాద్ జిల్లా కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులపై ప్లాన్ ప్రకారం దాడి జరిగింది.

తెలంగాణకు మోదీ సర్కార్ ఏం చేసిందో చెప్పాలి : మంత్రి పొన్నం

హైదరాబాద్,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది అయిన సందర్భంగా ఓ వైపు ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తోంది. ఇదే సమయంలో పాలకపక్షం వైఫల్యాలపై బీజేపీ సరూర్ నగర్‌లో బహిరంగ సభకు ప్లాన్ చేసింది. ఈ క్రమంలో బీజేపీపై రుసరుసలాడారు మంత్రి పొన్నం ప్రభాకర్. చారిత్రాత్మక ప్రాంతం చార్మినార్ నుంచి బీజేపీపై పలు ప్రశ్నలు సంధించారు మంత్రి పొన్నం. గడిచిన 11 ఏళ్లలో తెలంగాణకు మోదీ సర్కార్, ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకి ఏమి ఇవ్వక పోగా, గత ప్రభుత్వం అడగలేదనే నెపంతో దాట వేసే ధోరణిని తప్పుబట్టారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మొన్న వరదలు వచ్చినప్పుడు నష్ట పరిహారం ఇవ్వకుండా తెలంగాణపై వివక్ష చూపలేదా అంటూ సూటిగా ప్రశ్నించారు. గతంలో ఆర్కియాలజీ– టూరిజం మంత్రిగావున్న కిషన్‌రెడ్డి మీ ముద్ర ఏది? హైదరాబాద్ నగరానికి ఏం చేశారనేది సరూర్ నగర్ సభలో చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ అంటే చెరువులకు కేరాఫ్ అని, దాన్ని బాగు చేసుకోవడం తమ బాధ్యతగా చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తమ ప్రభుత్వం కేంద్రాన్ని అన్నిరకాలుగా తెలంగాణకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కానీ ఎలాంటి చలనం లేదన్నారు. ముమ్మాటికీ తెలంగాణ ప్రయోజనాలకు నెరవేరుస్తున్నామని చెప్పుకొచ్చారు.

దామరచర్లను ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

నల్లగొండ, డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): సీఎం రేవంత్ నల్లగొండ జిల్లా దామరచర్లలో నిర్మించిన యాదాద్రి విద్యుత్ కేంద్రంతోపాటు పలు ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. ఇప్పటికే దామరచర్లను పూర్తిగా ఆదీనంలోకి తీసుకున్న పోలీసులు జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేస్తున్నారు. శనివారం తెల్లవారుజాము నుంచే అరెస్టుల పర్వం మొదలైంది. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, నల్లమోతు భాస్కర్ రావును హౌస్ అరెస్టు చేశారు. అదేవిధంగా నల్లగొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డితోపాటు పలువురు పట్టణ పార్టీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. కనగల్ మాజీ ఎంపీపీ కరీం పాషా, తిప్పర్తి, మాడ్గులపల్లి మండలాల్లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులను అరెస్టు చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఇక మిర్యాలగూడ, నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల్లో కూడా బీఆర్ఎస్ లీడర్లను మందుస్తుగా అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసుల తీరుపై బీఆర్ఎస్ నాయకులు మండిపడుతున్నారు. తామేం తప్పు చేశామని అరెస్టు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

కాంగ్రెస్ అంటేనే ఏమార్చడం

పచ్చటి పాలాల్లో చిచ్చుపెడుతున్న రేవంత్

ప్రజాపాలన కాదు.. నిర్బంధ పాలన : మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): కాంగ్రె స్ ప్రభుత్వం అంటేనే ఏమార్చడం, మోసం చేయ డమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నాడు ఫార్మా సిటీ అన్నారు, నేడు మాట మార్చి పచ్చ టి పొలాల్లో చిచ్చు బెడుతున్నారని విమర్శించారు. గిరిజనుల బిడ్డలను జైళ్ల పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేంత్‌రెడ్డి.. మాట మార్చడమే మీ విధానమా? ప్రజలను మభ్య పెట్టడమే కాంగ్రెస్ పద్ధతా అని నిలదీశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ట్రిపుల్ ఆర్ బాధితులు, రైతులు హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా విషయం లో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీని, ఎన్నికల తర్వాత మాట తప్పిన వైఖరిని ఆయనకు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు ఎవరూ తమ బాధను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట తప్పి, నిబంధనలకు విరుద్ధంగా సర్వేలు నిర్వహిస్తున్నారని, భూసేకరణ పత్రాలపై బలవంతంగా సంతకాలు పెట్టిస్తున్నారని బాధను వెలిబుచ్చారు. భూసేకరణ చట్టం అమలు చేయకుండా, తక్కువ ధరకే భూములు లాక్కునే కుట్ర చేస్తున్నారని వివరించారు. తమ సమస్య పట్ల ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీయాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు బాధితులకు ధైర్యం చెప్పారు. ఎన్నికల హామీలో చెప్పిన విధంగా కాంగ్రెస్ మాట నిలుపుకునే వరకు బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడు తూ.. 'ఉత్తర దిక్కు ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకో వాలని ప్రియాంకా గాంధీ, సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలను బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో బాధితులకు కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ చేత హామీ ఇప్పించి ఇప్పుడు మాట మార్చడం దుర్మార్గం. ఆర్ఆర్ఆర్ ఏర్పాటు విషయంలో ఉత్తర భాగంలో 40 కిలోమీటర్లకు బదులుగా 28 కిలో మీటర్లను పరిగణనలోకి తీసుకోవడం వల్ల చౌటుప్పల్ మున్సిపాలిటీ, మండల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పట్టణం మధ్య నుంచి రోడ్డు వెళ్లడంతో మున్సిపాలిటీ 2 భాగాలుగా విడిపోతున్నది. బాధితులు 2 పంటలు పండించే పచ్చని పొలాలను, ఇండ్లు, ప్లాట్లను కోల్పోతున్నా ప్రభుత్వం కనికరించడం లేదు. చౌటుప్పల్ పద్ద జంక్షన్ రింగు గతంలో 78 ఎకరాల్లో ఉంటే ఇప్పుడు 184 కు పెంచడం వల్ల పేదల భూములు, ప్లాట్లు కోల్పోతున్నారు. దీనికిగాను నష్టపరిహారం కూడా తక్కువ చెల్లిస్తున్నారు. ఎంపీగా ఉన్నపుడు కోమటి రెడ్డి.. బాధితులతో కలిసి ఆర్ఆర్ఆర్‌ను మార్చాలని, రాయగిరి, చౌటుప్పల్ రైతులతో కలిసి ధర్నాలు చేశారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంలోనూ అలైన్‌మెంట్ మార్చుతామని హామీలు ఇచ్చారు. ఇప్పుడేమో అదే పోలీసు బలగాలతో, నిర్బంధంగా రోడ్డుకు 28 కిలోమీటర్ల పరిధిలోనే సర్వే చేయించి, ఒప్పంద పత్రాల మీద సంతకాలు పెట్టాలని బలవంత దుర్మార్గం.

మరో 15 ఏళ్లు మాదే అధికారం

ఏడాది పాటు అద్భుతమైన పాలన

రానున్న సంవత్సరాలకు ప్రణాళిక సిద్ధం

తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుంది. నేతలంతా విజయోత్సవాలు చేసుకున్నారు. ఈ క్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్. ఈ ఐదేళ్ళు కాదు.. రానున్న మరో పదేళ్లు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందన్నారు. తెలంగాణలో ప్రభుత్వం కొలువు తీరి ఏడాది సందర్భంగామాట్లాడారు. ఏడాది పాటు అద్భుతమైన పాలన అందించామన్నారు. రానున్న సంవత్సరాలకు ప్రణాళిక సిద్ధమైందన్నారు. వాటిని త్వరలో అమలు చేస్తామన్నారు. మా ప్రభుత్వానికి ఇప్పటికైతే ఐదుకి 4. 5 మార్కులు ప్రజలు ఇస్తున్నారని వివరించారు. ఈసారి గ్రేటర్‌లో కాంగ్రెస్‌దే హవా ఉండబోతోందన్నారు టీపీసీసీ. లోకల్ బాడీ ఎన్నికల్లో 80 సీట్లు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్ళు కాదు రానున్న 10 నుంచి 15 ఏళ్లు సుస్థిరంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని నమ్ముతున్నామని మనసులోని మాట బయటపెట్టారు. విప్‌లు, ఎమ్మెల్సీలు, నామినేట్ పోస్ట్ విషయంలో సామాజిక న్యాయాన్ని పాటించామని తెలిపారు. ఉద్యమం నుంచి ఉద్భవించిన తెలంగాణకి ప్రతిరూపంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని వివరించారు. బతుకమ్మను తొలగించామని, దాన్ని వాళ్ళ పేటెంట్‌గా బీఆర్ఎస్ సీన్ చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. ముఖ్యమంత్రితో ఈ విషయంపై చర్చించి షాద్‌నగర్ ఎమ్మెల్యేను వివరణ ఇవ్వమని కోరామని మంత్రి కొండా సురేఖ గతంలో నాగార్జున ఫ్యామిలీపై చేసిన వ్యాఖ్యలు వివరణ ఇచ్చారని, ఇలాంటివి భవిష్యత్తులో జరగకుండా గట్టిగా చర్యలు తీసుకుంటామన్నారు.

##

విరాళం దాతలకు
3 సార్లు వీఐపీ బ్రేక్ దర్శనాలు

తిరుమల,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి):ఆనంద నిలయం అనంత స్వర్ణమయం పథకానికి విరాళం ఇచ్చిన దాతలకు వీఐపీ బ్రేక్ (జనరల్) దర్శనాలను ఇవ్వాలని టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుంది. 2008లో టీటీడీ సంకల్పించిన ఈ పథకాన్ని కొన్ని అనివార్య కారణాల వల్ల నిలిపివేశారు. అప్పట్లో ఈ పథకానికి విరాళం ఇచ్చిన దాతలకు అర్చనానంతర దర్శనం కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. అర్చనానంతర దర్శనానికి బదులుగా గరిష్టంగా 5గురు కుటుంబ సభ్యులకు సంవత్సరానికి 3 రోజులు వీఐపీ బ్రేక్ జనరల్ దర్శనాలకు అనుమతి ఇవ్వాలని, రూ. 2,500 టారిఫ్‌లో సంవత్సరానికి 3 రోజులు వసతి , సంవత్సరానికి ఒకసారి 20 చిన్న లడ్డూలు ప్రసాదంగా అందించాలని నిర్ణయించింది. దాతల దర్శన సమయంలో సంవత్సరానికి ఒకసారి బహుమానంగా ఒక దుపట్టా, ఒక బ్లౌజ్, మొదటిసారి దర్శన సమయంలో 5 గ్రాముల బంగారు డాలర్, 50-గ్రాముల వెండి నాణెం బహుమానంగా ఇవ్వనున్నట్లు వెల్లడించింది. సంవత్సరానికి ఒకసారి పది మహాప్రసాదం ప్యాకెట్లు, విరాళం పాస్‌బుక్ జారీ చేసిన తేదీ నుంచి 25 సంవత్సరాల పాటు ఈ సేవలు అందుతాయని స్పష్టం చేసింది.

రేషన్ అక్రమాలపై విచారణ సంతోషకరం

సోలార్ విద్యుత్ ఒప్పందాల ముడుపులపై విచారణ ఎక్కడ? : వైఎస్ షర్మిల

అమరావతి,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): రేషన్ బియ్యం అక్రమాలపై విచారణకు స్పెషల్ సిట్ వేయడం సంతోషకరమని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హర్షం వ్యక్తం చేశారు. మరి సోలార్ విద్యుత్ ఒప్పందాల్లో జరిగిన రూ.1750 కోట్ల ముడుపులపై విచారణ ఎక్కడ అని ప్రశ్నించారు. బియ్యం మాఫియాపై పెట్టిన శ్రద్ధ.. అదానీ అక్రమ డీల్‌పై ఎందుకు పెట్టలేక పోతున్నారని కూటమి ప్రభుత్వాన్ని నిలదీసింది. అమెరికా దర్యాప్తు సంస్థలు ఇచ్చిన నివేదికలకు విలువ లేదా ? మాజీ ముఖ్యమంత్రి స్వయంగా లంచాలు తీసుకున్నారని నివేదిక ఇస్తే , నిజాలు నిగ్గు తేల్చే బాధ్యత మీది కాదా? మీరు కూడా అదానీకి అమ్ముడుపోయారా? తీగ లాగితే మాజీ ముఖ్యమంత్రితో పాటు, అదానీని సైతం అరెస్టు చేయాల్సి వస్తుందని భయపడుతున్నారా? నోరు విప్పకుండా, విచారణ చేయకుండా మౌనంగా ఉండేందుకు అదానీ మీకు ఎంత లంచాలు ఆఫర్ చేశారు అని కూటమి ప్రభుత్వ నాయకులను వైఎస్ షర్మిల నిలదీశారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా.. సెకీతో చేసుకున్న ఒప్పందంలో భారీ అవినీతి జరిగిందని అన్నారని.. టెండర్లు లేకుండా అదానీకి కట్టబెట్టడం అంటే పెద్ద ఎత్తున లంచాలు తీసుకున్నారని ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. గుజరాత్ లో రూ 1.99 పైసలు దొరికే సోలార్ విద్యుత్ ను రాష్ట్ర ప్రభుత్వం రూ. 2.49 పైసలకు ఎలా కొన్నారని ఉద్యమాలు చేశారని అన్నారు. 25 ఏళ్ల పాటు డీల్ అంటే రాష్ట్ర ప్రజల నెత్తిన లక్ష కోట్ల అదనపు భారం పడిందని చెప్పారన్నారు. ఇది ప్రజలను అదానీ కోసం నిలువునా దోచి పెట్టడం అని చెప్పారని వ్యాఖ్యానించారు. ఈ డీల్ రద్దు చేయాలని ఇప్పటి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ద్వారా హైకోర్టులో కేసు కూడా వేయించారని గుర్తుచేశారు. అధికారంలో వచ్చాక నిజాలు నిగ్గు తేలుస్తాం అని.. గొప్ప గొప్ప మాటలు చెప్పారని.. మరి ఇప్పుడేమైంది చంద్రబాబు అని నిలదీశారు.

కూటమి వచ్చాక విద్యారంగం నిర్వీర్యం : మేరుగ

అమరావతి,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమయ్యిందని మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు మేరుగ నాగార్జున ఆరోపించారు. శనివారం తాడేపల్లిలోని వైసీపీ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విద్యామీట్లను దగా మీట్లుగా అభివర్ణించారు. వైసీపీ హయాంలో విద్యా క్యాలెండర్ ప్రకారం ఫీజులు అందేవని పేర్కొన్నారు. రూ. 72వేల కోట్లు కేటాయించి విద్యారంగంలో సంస్కరణలు తీసుకువచ్చామని, విద్యాదీవెన, వసతి దీవెన లాంటి పథకాలు విద్యారంగ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడ్డాయని వెల్లడించారు. ప్రభుత్వం రూ. 3,900 కోట్ల బకాయిలను విడుదల చేయడం లేదని ఆరోపించారు. జగన్ ప్రభుత్వం స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం పెడితే చంద్రబాబు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని , ప్రభుత్వ కుట్రలకు విద్యారంగం పూర్తిగా నాశనమైందని విమర్శించారు. ఉన్నత విద్యామండలిలలో ఇరవై మంది వైస్ ఛాన్స్‌లర్లను బెదిరించి రాజీనామాలు చేయించి ఇప్పటి వరకు ఎవరినీ కూడా భర్తీ చేయలేదని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలను కాకుండా ప్రైవేట్ పాఠశాలు అభివృద్ధి చెందాలనే కుట్రతో ప్రభుత్వం అడుగులు వేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులున్నాయని ఆరోపించారు. కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా రాష్ట్రంలోని వర్సిటీలకు వైస్ ఛాన్స్‌లర్‌ను ఎందుకు నియమించడం లేదని దుయ్యబట్టారు.

కుప్పంలో రెండు థియేటర్లు సీజ్

చిత్తూరు, డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): చిత్తూరు జిల్లా కుప్పంలో అల్లు అర్జున్ ఫ్యాన్స్‌కు షాక్ తగిలింది. పుష్ప 2 చిత్రం ప్రదర్శితమవుతున్న థియేటర్లను అధికారులు సీజ్ చేశారు. దీనిపై అల్లు అర్జున్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుప్పంలో ఓ స్థానిక నేతకు చెందిన లక్ష్మీ, మహాలక్ష్మీ థియేటర్లలో పుష్ప 2 చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. అయితే తాజాగా ఈ రెండు థియేటర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. థియేటర్ల లైసెన్స్ రెన్యువల్ చేసుకోకుండా, ఎన్‌వోసీ సర్టిఫికెట్ లేకుండానే సినిమాను ప్రదర్శిస్తున్నారంటూ నోటీసులు ఇచ్చారు. అర్ధాంతరంగా సినిమాను నిలిపివేసి మరీ థియేటర్‌కు తాళాలు వేశారు. దీంతో వీకెండ్‌లో సినిమా చూడాలని ఎంతో ఆశగా వచ్చిన ఫ్యాన్స్ తీవ్ర నిరాశకు గురయ్యారు. లైసెన్స్ రెన్యువల్ చేసుకోకుండా థియేటర్‌లో సినిమాలు ప్రదర్శిస్తున్నారని అధికారులు చెబుతున్నప్పటికీ.. దీనివెనుక కక్ష సాధింపు ఉన్నట్లుగా ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో నంద్యాలకు వెళ్లిన అల్లు అర్జున్ వైసీపీ నేత శిల్పా రవికి మద్దతు పలకడం పవన్ కల్యాణ్ అభిమానులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలకు ఆగ్రహం తెప్పించింది. సొంత ఫ్యామిలీకి చెందిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీకి కాకుండా ప్రత్యర్థులకు ప్రచారం చేయడమేంటని అల్లు అర్జున్‌పై పలువురు కక్ష కట్టారు. ఈ క్రమంలోనే పుష్ప 2 సినిమాపై కావాల్సినంత నెగిటివ్ ప్రచారం చేయాలని చూశారు. కానీ డిసెంబర్ 5వ తేదీన విడుదలైన పుష్ప 2 చిత్రం బ్లాక్‌బస్టర్ టాక్‌తో దూసుకెళ్తోంది. తొలిరోజే అత్యధిక గ్రాస్ వసూలు చేసిన సినిమాగా కూడా రికార్డు సృష్టించింది. ఈ క్రమంలోనే బన్నీకి వస్తున్న క్రేజ్ చూసి ఓర్వలేకనే ఇలా టీడీపీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అభిమానులు భావిస్తున్నారు.

ఆరునెలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహిస్తాం
6,347పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాం
ఉపాధ్యాయులు చదువు మాత్రమే చెప్పాలి
ఆంధ్రా మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రూపొందిస్తున్నాం
కేజీ టూ పీజీ కరికులం మారుస్తున్నాం
మహిళల్ని గౌరవించడం నేర్పించాలి
ముందు సమాజం లో మార్పు రావాలి
మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లో మంత్రి లోకేష్

అమరావతి,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): అధికారం లోకి వచ్చిన వెంటనే 16,347పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించామని మంత్రి లోకేశ్ అన్నారు. ఆరునెలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు. ఈ క్రమంలో మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించబోతున్నామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ చూస్తుంటే సంక్రాంతి పండుగ ముందే వచ్చినట్టుగా ఉందని అన్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ లో భాగంగా బాపట్ల మున్సిపల్ హైస్కూలులో జరిగిన కార్యక్రమానికి మంత్రి లోకేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ..."మిమ్మల్ని చూసిన తరువాత నాకు నా స్కూల్ డేస్ గుర్తు వచ్చాయి. చిన్నప్పుడు మా స్కూల్ లో పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ జరిగితే మా అమ్మ వచ్చేవారు. మా నాన్న అప్పటికే రాష్ట్రానికి టీచర్ కాబట్టి నా స్కూల్ కు రావడానికి ఆయనకి టైం ఉండేది కాదు. పిల్లల్లో నాకు దేవుడు కనిపిస్తాడు. పిల్లలంతా నా కొడుకు దేవాన్ష్ లాగే అనిపిస్తారు. మా వాడు హైదరాబాద్ లో నేను అమరావతి. వాడితో ఆడుకోవడం కూడా కుదరడం లేదు.ఎంత ఒత్తిడిలో ఉన్నా...ఎన్ని పనులు ఉన్నా..పిల్లలు కనిపిస్తే నేను ఆగిపోతాను. సరదాగా కాసేపు వాళ్లతో ఆడుకుంటాను. పిల్లల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యాశాఖ మంత్రిని కావడం నా అదృష్టం. ఏ వృత్తి చేపట్టిన వారైనా వారిని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే. ఉపాధ్యాయులంటే నాకు ఎంతో గౌరవం. జాతిపిత మహాత్మాగాంధీజీ చెప్పినట్లు విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమవుతుందని మా ప్రభుత్వం బలంగా నమ్ముతోంది. సీఎం చంద్రబాబు విజనరీ ఆలోచనలతో మన విద్యా వ్యవస్థ దేశానికే ఆదర్శంగా ఉండేలా ఆంధ్ర మోడల్ తీసుకొస్తున్నాం"అన్నారు.మెగా పీటీఎం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు మధ్య బంధం బలపడుతుందని మంత్రి లోకేశ్ అన్నారు. ఒక వ్యవస్థ బాగుపడాలంటే...అందులో అందరూ భాగస్వామ్యం అవ్వాలన్నారు. విద్యా వ్యవస్థ ఆదర్శంగా ఉండాలంటే సమాజ భాగస్వామ్యం తప్పనిసరి అని సీఎం చెప్పారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలు, సూచనలతో బడి భవిష్యత్తు కోసం చదివే పిల్లలు-వారి తల్లిదండ్రులు, చదువు చెప్పే ఉపాధ్యాయులు-గైడ్ చేసే హెడ్మాస్టర్లు, పాఠశాల యాజమాన్య కమిటీలు, దాతలు, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే లక్ష్యంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం రాష్ట్రమంతా ఒకేరోజున పండగ వాతావరణంలో నిర్వహించుకుంటున్నామన్నారు."పేరెంట్-టీచర్ మీటింగ్ ఒక రికార్డు. రాష్ట్రమంతా ఒకేసారి వేలాది స్కూళ్లలో, లక్షలాది విద్యార్థులు-టీచర్లు-తల్లిదండ్రులు సమావేశం కావడం ఒక చరిత్ర. రాష్ట్ర వ్యాప్తంగా 45,094 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలలో ఒకేసారి నిర్వహిస్తున్నాం. ఇందులో 35 లక్షల మంది విద్యార్థులు, 71 లక్షల తల్లిదండ్రులు, 1,88,266 మంది ఉపాధ్యాయులు, 50 వేలకు పైగా ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ సమావేశాలతో బడితో తల్లితండ్రులకు ఆత్మీయ బంధంఏర్పడుతుంది. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. ఈ సమావేశం ద్వారా పాఠశాలల సమస్యలు తెలుస్తాయి. పిల్లలు ఎలా చదువుతున్నారో తల్లిదండ్రులకు తెలుస్తుంది. విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందిస్తున్నాం. హెల్త్ డిపార్ట్‌మెంట్ సహకారంతో కొన్ని టెస్టులు చేసి ఆ రిపోర్ట్ కూడా పొందుపరుస్తున్నాం. దీని వల్ల విద్యార్థుల ఆరోగ్యం ఎలా ఉందో తల్లిదండ్రులు, టీచర్లకు తెలుస్తుంది. పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవడానికి దీనిద్వారా ఆస్కారమేర్పడుతుంది. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టే బాధ్యతను సీఎం నాపై పెట్టారు. విద్యాశాఖ అంటే ఎన్నో సవాళ్లతో కూడినది...అయినా ఛాలెంజ్ గా తీసుకుని నిర్వహిస్తున్నాను. విద్యా వ్యవస్థను రాజకీయాలకు దూరంగా ఉంచాలని కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నామని అన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి రంగులు - ఫోటోల పిచ్చి లేదని మంత్రి లోకేశ్ అన్నారు. తాను మంత్రి అయిన వెంటనే ఫోటోలు, రంగులు తీసేయమని ఆదేశాలు జారీ చేశానన్నారు. స్కూల్స్ లో ఒక్క జాబ్ మేళాలు తప్ప ఇతర ఏ కార్యక్రమాలు నిర్వహించకూడదని నిర్ణయం తీసుకున్నామన్నారు. రాజకీయ కార్యక్రమాలకు పిల్లల్ని తీసుకొని వెళ్లకూడదని ట్రిక్ట్ గా చెప్పానన్నారు. విద్యార్థులకు స్ఫూర్తి కలిగించేలా చరిత్రను, సంస్కృతిని గుర్తుచేసేలా విద్యారంగంలో విశేష సేవలందించిన వ్యక్తుల పేర్లను ప్రభుత్వ పథకాలకు పెట్టి వాటిని సమర్థవంతంగా ముందుకు తీసుకెళుతున్నామన్నారు. 1 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రూ. 944 కోట్లతో ఉచితంగా"సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్స్"పంపిణీ చేశామన్నారు. "డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం"కింద లక్షలాది మంది విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన, ఆయా ప్రాంతాల ఆహార అలవాట్లను గౌరవిస్తూ పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు చదువు మాత్రమే చెప్పాలి, మరుగుదొడ్లు, భోజనం ఫోటోలు తీయడం వారి బాధ్యత కాదని మంత్రి లోకేశ్ అన్నారు. దీనిపై ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో టీచర్లు చదువు మాత్రమే చెప్పాలి ఇతర పనులు, పనికిమాలిన యాప్స్ తొలగించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆంధ్రా మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రూపొందిస్తున్నామని తెలిపారు. పిల్లలను పిడుగులను తయారు చేసే బాధ్యత నాది అన్నారు. కేజీ టూ పీజీ కరికులం మారుస్తున్నామని తెలిపారు. చదువుతో పాటు నైతిక విలువలు చాలా ముఖ్యమని, మహిళల్ని గౌరవించడం చిన్న వయస్సు నుండే నేర్పించాలన్నారు. ముందు సమాజం లో మార్పు రావాలని, కొందరు చేతికి గాజులు వేసుకున్నావా అని మాట్లాడతారు, అమ్మాయి లా ఏడవకు అని అంటారు. ఈ మాటలు విన్న ప్రతి సారి నాకు బాధ వేస్తుందన్నారు. ఇవన్నీ పోవాలని, ఆడ, మగ సమానం అనే భావన కలిగేలా ప్రత్యేక పాఠ్యాంశాలు తీసుకొస్తామన్నారు. పిల్లల్లో నైతిక విలువలు పెంచడం కోసం నైతిక విలువల సలహాదారునిగా చాగంటి కోటేశ్వర రావును నియమించామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని విషయాల్లో నంబర్ 1 గా ఉండాలి అనేది తమ లక్ష్యం అన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకోవడానికి డిజిటల్ ల్యాబ్స్ ఏర్పాటు చెయ్యబోతున్నామన్నారు. స్టూడెంట్స్ లెర్నింగ్ అవుట్ కమ్స్ పై దృష్టిపెట్టామని తెలిపారు. అన్ని స్కూల్స్ లో టేబుల్స్ , లీక్ ప్రూఫ్ క్లాస్ రూమ్స్, తాగునీరు, మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం లా అర్ధరాత్రి ఆత్మలతో మాట్లాడి నిర్ణయాలు తీసుకోమన్నారు. విద్యాశాఖలో ఏ నిర్ణయం తీసుకున్నా.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంఘాలతో చర్చించి మాత్రమే తీసుకుంటున్నామన్నారు. డ్రగ్స్, గంజాయికి ఎడిక్ట్ అవ్వడం వలన ఒక తరం నాశనం అయ్యే ప్రమాదం ఉందన్నారు. అందుకే డ్రగ్స్ పై యుద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.

ఏపీలో కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు

హైకోర్టు తీర్పుతో ప్రభుత్వం కీలక నిర్ణయం
ముందస్తు నోటీసులివ్వాలని ఉద్యోగ సంఘాల డిమాండ్

అమరావతి,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేసే మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్ఏ) మేల్స్‌గా దాదాపు 15 నుంచి 22 ఏళ్లుగా సేవలందిస్తున్న ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ ప్రారంభం అయింది. 2002, 2003, 2007 ఇలా వివిధ దఫాలుగా రిక్రూట్‌మెంట్‌లో డీఎస్సీ సెలక్షన్ కమిటీ ద్వారా హెల్త్ అసిస్టెంట్లుగా ఎంపిక అయ్యారు. 2013లో జీవో నెంబర్ 1207 ద్వారా వీరిని ఉద్యోగులుగా గుర్తించారు. తొలుత ఎంపిక అయిన 1,000 మందిని, ఆ తరువాత కాలంలో ఈ జీవో ఆధారంగా ప్రభుత్వం నియమించిన మరో 600 మంది జీవితాలు ఇప్పుడు అగమ్యగోచరంగా మారాయి. హైకోర్టు తీర్పు మేరకు ఈ 1,600 మందిని విధుల నుంచి తొలగించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌వో)లను ఆదేశిస్తూ రాష్ట్ర ప్రజారోగ్య డైరెక్టర్ పద్మావతి ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో డీఎంహెచ్‌వోలు కూడా ఆ ఉత్తర్వులు ఉద్యోగులకు పంపారు. ఇప్పటికే ప్రకాశం జిల్లాలో 75 మంది, నెల్లూరు జిల్లా 164 మంది ఉద్యోగులను తొలగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఇదే పరంపర ఇతర జిల్లాల్లో కూడా కొనసాగుతోంది. అయితే ఈ ఉద్యోగుల్లో ఎక్కువ మంది 45-50 ఏళ్ల వయస్సు మధ్య ఉన్నవారే ఎక్కువ మంది ఉన్నారు. అయితే హైకోర్టు తీర్పును అమలు చేయడానికి మూడు నెలల సమయం ఉందని, కానీ వారం కూడా తిరగకుండా హడావుడిగా ప్రభుత్వం విధుల నుంచి తొలగించిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేయడానికి అవకాశం ఉందని, ఈ విషయం ప్రభుత్వం ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని ప్రశ్నించారు. ఉద్యోగుల తొలగింపుపై ప్రభుత్వం పునరాలోచించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డి.ఆస్కార్ రావు కోరారు. కోర్టు తీర్పు ప్రకారం మూడు నెలల ముందస్తు నోటీసు ఇచ్చి, మూడు నెలల జీతం ఇచ్చిన తరువాతే తొలగించాలని తెలిపారు. పదవీ విరమణ దశలో కొంత మంది ఉద్యోగులు ఉన్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగులను తొలగించడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ ప్రారంభమైందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. దీంతో ఆయా వర్గాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొంటునున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తొలుత ఆంధ్రప్రదేశ్ ఖనిజా అభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)లో వైసీపీ సర్కార్ నియమించిన 50 మంది కాంట్రాక్ట్, 45 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను మొత్తం 95 మందిని తొలగించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ బేవరేజ్ కార్పొరేషన్‌లో టెండర్ల రూపంలో మద్యం షాపులు ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడంతో ప్రభుత్వం మద్యం షాపులను రద్దు అయ్యాయి. దీంతో ప్రభుత్వ మద్యం షాపుల్లో నియమితులైన సేల్స్ సూపర్ వైజర్లు 3,585 మంది, సేల్స్ మెన్లు 8,778 మంది మొత్తం 12,363 మంది ఉద్యోగులు తమ ఉద్యోగాలు కోల్పోయారు. అలాగే గత ప్రభుత్వ హయంలో నియమితులైన 2,48,779 గ్రామ, వార్డు వాలంటీర్లను తొలగించారు. ఇటీవలి మంత్రి డోలా వీరాంజనేయస్వామి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. ఆయన ప్రకటన వెలువడిన రెండు రోజులకే గ్రామ, వార్డు సచివాలయాల్లో అటెండెన్స్ యాప్ నుంచి వాలంటీర్లను తొలగించారు. దీంతో రాష్ట్రంలో 2,48,779 మంది వాలంటీర్లను తొలగించినట్లు స్పష్టం అయిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

పరవాడ ఫార్మాసిటీలో మరో ప్రమాదం

పరిశ్రమలో కార్మికుల పరుగులు

అనకాపల్లి,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): అనకాపల్లి పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ విజయశ్రీ ఆర్గానిక్స్ లో ప్రమాదం జరిగింది. ఏఎన్ఎఫ్ బ్లాక్ లో కెమికల్స్ దించుతున్న సమయంలో ప్రమాదం సంభవించింది. డ్రయర్ లో ఉన్న ప్రోడక్ట్ ను బయటికి తీసే ప్రయత్నం చేశారు. దీంతో ఒక్కసారిగా కెమికల్ పౌడర్ విధుల్లో ఉన్న ఇద్దరు కార్మికులపై కెమికల్ పడింది. ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదం జరిగిన ఘటన తెలిసి మిగిలిన కార్మికులు ఉలిక్కిపడ్డారు. సమాచారం తెలుసుకున్న మిగిలిన పరిశ్రమల కార్మికులు పరుగులు తీశారు. క్షతగాత్రుల ను.. హుటాహుటిన హాస్పిటల్ తరలించారు. జరిగిన ప్రమాదంలో గాయపడిన వారిలో పరవాడ మండల బాపడుపాలెం చెందిన చక్రపాణి సత్య వెంకట సుబ్రహ్మణ్య స్వామి కాగా, మరొకరు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రజాక్. ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు పోలీసులు. పది రోజుల క్రితం విషవాయువులు లీకై ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

పాఠశాలల నుంచే డ్రగ్స్ వ్యతిరేక పోరాటం

ఈగిల్ వ్యవస్థతో గంజాయి నిర్మూలన.. సైబర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి
టీచర్-పేరెంట్స్ మీటింగ్‌లో బాబు హెచ్చరిక



బాపట్ల,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): డ్రగ్స్ వ్యతిరేక పోరాటం పాఠశాలల నుంచే ప్రారంభం కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. పిల్లల చదువును తల్లిదండ్రులు పర్యవేక్షించాలి. వారు స్మార్ట్‌ఫోన్లకు బానిసలు కాకుండా చూసుకోవాలి. డ్రగ్స్ వ్యసనానికి విద్యార్థులు దూరంగా ఉండాలి. మానవ సంబంధాలను మాదక ద్రవ్యాలు నాశనం చేస్తాయి. రాష్ట్రంలో ఈగల్ పేరుతో డ్రగ్స్ నిరోధక వ్యవస్థను ఏర్పాటు చేశాం. ఈ రక్కసిని కర్కశంగా అణచివేస్తామన్నారు. ఈగల్ వ్యవస్థపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈగల్ వ్యవస్థను తీసుకువచ్చి గంజాయి వినియోగాన్ని పూర్తిగా నివారిస్తామని తెలిపారు. బాపట్ల మున్సిపల్ పాఠశాలలో శనివారం పేరెంట్స్-టీచర్స్ సమావేశం జరిగింది. బాపట్లలో మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులతో చంద్రబాబు, లోకేష్ మాట్లాడారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో చంద్రబాబు, లోకేష్ ముఖామఖి నిర్వహించారు. ఎలక్ట్రానిక్ డివైసెస్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.సైబర్ నేరగాళ్లు చాలా మంది తయారయ్యారని వారి చర్యలకు అడ్డుకట్ట వేయాలని అన్నారు. మాయమాటలతో స్నేహం పేరుతో జీవితాలు నాశనం చేసే స్థాయికు వారు వచ్చారన్నారు. టెక్నాలజీతో మంచితో పాటు చెడు ఉంటుందని గుర్తుంచుకోవాలని అన్నారు. 24 గంటలపాటు ఫోన్ చూడటం వ్యసనం.. అదొక బలహీనత అని చెప్పారు. టీచర్లు, తల్లిదండ్రులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ బారిన పడి జీవితాలను పాడు చేసుకోవద్దని అన్నారు. ఒకసారి డ్రగ్స్ వ్యసనంలో పడితే తిరిగి మామూలు మనిషి కావడం కష్టమన్నారు. ఆ వ్యసనం సర్వనాశనం చేస్తుందని హెచ్చరించారు. గంజాయి కూరగాయల్లా ఇంటి దగ్గరే పండించే స్థాయికి వచ్చారని సీఎం చంద్రబాబు చెప్పారు. బాపట్ల సభలో చంద్రబాబు కొద్దిసేపు మౌనం పాటించారు. దీని వెనుక గొప్ప సంస్కారం ఉంది. బాపట్ల మున్సిపల్ హైస్కూల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం జరుగుతుంది. డ్రగ్స్ వద్దు బ్రో అంటూ విద్యార్థి ప్రసంగించాడు.. ఆ విద్యార్థితో సీఎం మాట్లాడటం ప్రారంభించారు. ఇంతలో మసీదులో నుంచి నమాజ్ ప్రారంభమైంది. వెంటనే సీఎం చంద్రబాబు మౌనం పాటించారు.. అందరూ నిశ్శబ్దంగా ఉండాలని సూచించారు. నమాజ్ ముగిసిన వెంటనే.. మళ్లీ సీఎం చంద్రబాబు ప్రసంగం ప్రారంభమైంది.

వైసీపీ బాధ్యతలు విజయమ్మకు అప్పగించాలి

రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

అమరావతి,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిపై రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ విమర్శలు గుప్పించారు. విజయసాయి చీప్ ట్వీట్స్ పెట్టడం సరికాదని ఆమె విమర్శించారు. సీపోర్టు అక్రమాలు, రేషన్ మాఫియాను తప్పుదారి పట్టించడం కోసమే ఆయన ట్వీట్స్ చేస్తున్నారని అన్నారు. ఇలాగే ఉంటే వచ్చేసారి వైసీపీకి 11 సీట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన వాసిరెడ్డి పద్మ.. శనివారం ఉదయం విజయ వాడ ఎంపీ కేశినేని చిన్నిని మర్యాదప

ఎమ్మెల్యేల చేత ప్రమాణస్వీకారం చేయించిన సీఎం ఫడ్నవీస్

ముంబై, డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): మహారాష్ట్రలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే. ఆ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ గురువారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతోపాటు డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ షిండే , అజిత్ పవార్ లు కూడా ప్రమాణం చేశారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర శాసనసభ శనివారం ప్రత్యేకంగా సమావేశమైంది. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. సీఎం, డిప్యూటీ సీఎంలతోపాటు ఎమ్మెల్యేలంతా శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అంతకుముందు విధాన్ భవన్ కాంప్లెక్స్ ఆవరణలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహానికి సీఎం, డిప్యూటీ సీఎంలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు.

నా ల్యాప్‌టాప్, ఫోన్లు పదేపదే హ్యాక్ అవుతున్నాయ్ : పిట్రోడా

న్యూఢిల్లీ, డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): గత కొన్ని వారాలుగా తన ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, సర్వర్‌లు పదేపదే హ్యాక్ అవుతున్నాయని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు శామ్ పిట్రోడా తెలిపారు. అంతటితో ఆగని హ్యాకర్లు తనపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు చెప్పారు. క్రిప్టోకరెన్సీ రూపంలో వేల డాలర్లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 'గత కొన్ని వారాలుగా నా ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్, సర్వర్‌లు పదేపదే హ్యాక్ అవుతున్నాయి. హ్యాకర్లు క్రిప్టోకరెన్సీ రూపంలో పది వేల డాలర్లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అడిగిన మొత్తం చెల్లించకపోతే నా ప్రతిష్ఠను దెబ్బతీస్తామని హెచ్చరించారు' అని పిట్రోడా తెలిపారు. తెలియని మొబైల్ నెంబర్, మెయిల్ నుంచి తన పేరుతో ఎలాంటి మెసేజ్‌లు వచ్చినా వాటిని ఓపెన్ చేయొద్దని, వాటికి స్పందించొద్దని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

ఎంవీఏ కూటములో విభేదాలు

కూటమి నుంచి వైదొలిగిన సమాజ్ వాదీ పార్టీ

ముంబై, డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): మహారాష్ట్రలో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి నుంచి బయటకొస్తున్నట్లు ఆ రాష్ట్ర సమాజ్ వాదీ పార్టీ వెల్లడించింది. ఎంవీఏలో భాగస్వామ్య పక్షమైన శివసేన (యూబీటీ)కి ఉన్న హిందూత్వ భావజాలం కారణంగా కూటమి నుంచి బయటకు వస్తున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ మహారాష్ట్ర అధ్యక్షుడు అబు అజ్మీ తెలిపారు.'బాబ్రీ మసీదు కూల్చివేతను సమర్థిస్తూ శివసేన (యూబీటీ) ప్రకటన ఇచ్చింది. ఆ పార్టీ అధినేత ఉద్ధవ్ ఠాక్రే సన్నిహితుడు దానిని సమర్థిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఎంవీఏ కూటమికి చెందిన నేతలు ఇలాంటి చర్యలకు పాల్పడితే బీజేపీకి వారికి తేడా ఏముంది మేం ఇంకా ఎందుకు వారితో కలిసి ఉండాలి మహా వికాస్ అఘాడీ నుంచి మేం వైదొలుగుతున్నాం. ఇదే విషయాన్ని పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లాం.' అని అబు అజ్మీ పేర్కొన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేతపై శివసేన (యూబీటీ) ఎమ్మెల్సీ మిలింద్ నర్వేకర్ సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్ట్ చేశారు. 'ఈ పని చేసిన వారి పట్ల నేను గర్వంగా ఉన్నా' అని శివసేన వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రే చేసిన వ్యాఖ్యలను రాసుకొచ్చారు. అటు ఓ వార్తాపత్రికలోనూ దీనిపై ప్రకటన ఇచ్చారు. ఈ పరిణామాలపై సమాజ్‌వాదీ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్పీ పార్టీ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు గెలుపొందారు.ఇదిలా ఉండగా హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమి ఓటమి చవిచూసిన నేపథ్యంలో కూటమిలో లుకలుకలు బయటపడుతున్నాయి.

స్వల్పకాలంలోనే 3సార్లు భూకంపం

న్యూఢిల్లీ, డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాన్ని వరుస భూకంపాలు వణికించాయి. మండి జిల్లాలో శనివారం తెల్లవారుజామున 2:26 గంటల ప్రాంతంలో భూకంపం సంభవించింది. స్వల్ప వ్యవధిలోనే మూడు సార్లు భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 3.3గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి ఐదు కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. వరుస ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. నిద్ర నుంచి ఉలిక్కిపడి లేచి ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే, స్వల్ప స్థాయిలోనే ప్రకంపనలు నమోదు కావడంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. కాగా, తెలంగాణ రాష్ట్రంలోనూ మరోసారి భూకంపం సంభవించింది. మహబూబ్ నగర్ జిల్లాలోని కౌకుంట్లలో 3.0 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదయ్యాయి.

కూటమికి సారథ్యం వహిస్తా

ఇండియా కూటమికి నాయకత్వం వహించేందుకు సిద్ధం

భాగస్వామ్య పక్షాలు కోరితే సిద్ధంగా ఉన్నా..

చానల్ ఇంటర్వ్యూలో మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు

మమతా బెనర్జీ ప్రకటనపై భాగస్వామ్య పక్షాల మిశ్రమస్పందన

కోల్‌కత్తా, డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): ఇండియా కూటమికి నాయకత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నానన్న బంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ప్రకటనపై భాగస్వామ్య పక్షాల నుంచి మిశ్రమస్పందన వ్యక్తమవుతోంది. భాగస్వామ్య పక్షాలు కోరితే ఇండియా కూటమికి సారథ్యం వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఓ జాతీయ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మమతా బెనర్జీ పేర్కొనటంతో చర్చ మొదలైంది. ఇండియా కూటమిని తానే ఏర్పాటు చేశానన్న దీదీ దాన్ని సరిగ్గా నిర్వహించాల్సిన బాధ్యత సారథి స్థానంలో ఉన్న వారిపై ఉందన్నారు.కాంగ్రెస్ సరైన ప్రదర్శన చేయకపోతే తానేం చేయలేనంటూ హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలను దృష్టిలో ఉంచుకొని మమతా బెనర్జీ అన్నారు. బంగాల్ సీఎం వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. జాతీయస్థాయి బాధ్యతలకు సంబంధించి మమతాబెనర్జీ సామర్థ్యాన్ని ప్రశ్నించింది. బంగాల్‌లో వరుసగా 3సార్లు అధికారం చేపట్టినప్పటికీ దేశవ్యాప్తంగా టీఎంసీని విస్తరించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని గుర్తుచేసింది. బంగాల్‌ను దాటి పార్టీని విస్తరించలేని సీఎం జాతీయస్థాయి నాయకత్వ బాధ్యతలు చేపట్టి ఎలా రాణించగలరని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. అయితే దీదీ ప్రకటనను కూటమిలోని కీలక పార్టీలైన సమాజ్‌వాదీ పార్టీ, శివసేన ఉద్ధవ్ వర్గాలు సమర్థించాయి. కూటమి బాధ్యతలు మమతకు అప్పగించాలనే విషయంలో తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించాయి. బంగాల్‌లో బీజేపీని ఆమె ఒంటరిగా, ఎంతో సమర్థంగా నిలువరిస్తున్నారని ఎస్ పీ నేతలు ప్రశంసించారు. కూటమిలో మమతాబెనర్జీ ప్రధాన భాగస్వామి కావాలని కోరుకుంటున్నట్లు శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంజయ్ రౌత్ తెలిపారు. త్వరలోనే మిత్రపక్షాలతో కలిసి కోల్‌కతాకు వెళ్లి దీదీతో భేటీ కానున్నట్లు చెప్పారు. ఇండియా కూటమి సమావేశం జరిగినప్పుడు ఈ విషయాన్ని ప్రస్తావించనున్నట్లు రౌత్ తెలిపారు.బంగాల్‌లో బీజేపీ అధికారం చేపట్టకుండా చేయటంలో మమత బెనర్జీ విజయవంతం అయ్యారని ఆ పార్టీకి చెందిన నాయకురాలు ప్రియాంక చతుర్వేది ప్రశంసించారు. బిహార్ మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్ కూటమికి నేతృత్వం వహించేందుకు సరైన నాయకుడవుతారని ఆర్ జేడీ అభిప్రాయపడింది. హరియాణా, మహారాష్ట్ర ఫలితాలపై కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఇండియా కూటమి సారథ్యం వహిస్తున్న ఆ పార్టీ మిత్రపక్షాలకు సరైన ప్రాతినిథ్యం ఇవ్వలేదని దుయ్యబట్టారు.

ప్రధాని మోదీని హత్య చేస్తామని బెదిరింపులు

అప్రమత్తమైన పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం

న్యూఢిల్లీ, డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): ప్రధాని నరేంద్ర మోదీని హత్య చేస్తామని ఒక బెదిరింపు సందేశం వాట్సాప్ ద్వారా ముంబై పోలీసులకు శనివారం అందింది. ట్రాఫిక్ పోలీస్ హెల్ప్ లైన్ కు పంపిన ఆ మెసేజ్ లో మోదీని లక్ష్యంగా చేసుకుని ఇద్దరు ఐఎస్ ఐ ఏజెంట్లు బాంబు పేలుళ్లకు కుట్ర పన్నినట్లు పేర్కొన్నారు. ఒక సీనియర్ రాజకీయ నాయకుడిని చంపేస్తామని ముంబై పోలీసులకు రెండు వారాల క్రితం కూడా ఒక మెసేజ్ వచ్చింది.ప్రధాని మోదీని హత్య చేస్తామని బెదిరిస్తూ సందేశం వచ్చిన నంబర్ రాజస్థాన్ లోని అజ్మీర్ లో ఉన్నట్లు గుర్తించామని, దుండగుడిని పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ప్రధాని మోదీ ని హత్య చేస్తామని బెదిరిస్తూ సందేశం పంపిన వ్యక్తి మానసిక రోగి అయి ఉండవచ్చని, లేదా మద్యం మత్తులో ఉండవచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. పీఎం మోదీ ని హత్య చేస్తామని గతంలో ముంబై

మైనర్‌పై హత్యాచారం చేసిన వ్యక్తికి మరణశిక్ష

పశ్చిమ బెంగాల్ స్థానిక కోర్టు కీలక తీర్పు

పరగణా, డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): పశ్చిమబెంగాల్లోని దక్షిణ 24 పరగణాల్లో అక్టోబర్ 4న తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన 19 ఏళ్ల యువకుడికి స్థానిక కోర్టు మరణశిక్ష విధించింది. కుల్తాలీ ప్రాంతంలో నేరం జరిగిన కొన్ని గంటల్లోనే నిందితుడు ముస్తాకిన్ సర్దార్ ను అక్టోబర్ 5న తెల్లవారుజామున 3 గంటలకు అరెస్టు చేశారు. దేశాన్ని కుదిపేసిన కోల్కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్లో ఆగస్టు 9న 31 ఏళ్ల జూనియర్ డాక్టర్ పై అత్యాచారం, హత్య జరిగిన రెండు నెలల తర్వాత ఈ ఘటన జరిగింది. బాధిత బాలికను అత్యాచారం చేసి, దారుణంగా హింసించి హత్య చేసిన ఘటనపై స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. అక్టోబర్ 5న గ్రామస్తులు స్థానిక పోలీసులపై దాడి చేసి స్థానిక మహిష్మారీ పోలీస్ ఔట్ పోస్టులోని కొంత భాగాన్ని తగలబెట్టారు. స్థానిక తృణమూల్ కాంగ్రెస్ లోక్ సభ సభ్యురాలు ప్రతిమా మొండల్ ను బాలిక కుటుంబాన్ని కలవకుండా అడ్డుకున్నారు. నిందితుడిని ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే అరెస్ట్ చేసిన పోలీసులు అతడిపై బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత) సెక్షన్ 103, 66, పోక్సో (లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ) చట్టంలోని సెక్షన్ 6 కింద కేసులు నమోదు చేశారు. బాధిత బాలిక ప్రైవేట్ ట్యూటోరియల్ క్లాసుకు హాజరై తన ఇంటికి నడుచుకుంటూ తిరిగి వెళ్తోంది. నిందితుడు ముస్తాకిన్ సర్దార్ తన సైకిల్ పై ఆమెను ఇంటి వద్ద దింపుతానని చెప్పి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి, అత్యాచారం చేసి హత్య చేశాడు. సర్దార్ చిన్నారిని ఎత్తుకోవడాన్ని తాను చూశానని ఈ కేసులోని సాక్షుల్లో ఒకరు కోర్టులో చెప్పారు. ఆ వ్యక్తి సర్దార్ ను ప్రశ్నించగా కుటుంబ సభ్యుల సూచన మేరకు ఆమెను ఇంటి వద్ద డ్రాప్ చేయడానికి తీసుకువెళ్తున్నానని చెప్పాడు. బాధితురాలిని ముస్తాకిన్ సర్దార్ దారుణంగా హింసించినట్లు పోస్ట్ మార్టం నివేదికలో తేలింది. బాధితురాలి శరీరంపై 38 గాయాలు కనిపించాయి. ఆమె పుర్రె పగిలిపోయింది. చేయి విరిగిపోయింది. శాస్త్రీయ ఆధారాలు, డీఎన్ఏ పరీక్షల్లో సర్దార్ ఈ దారుణానికి పాల్పడినట్లు నిర్ధారణ అయింది. ఈ ఘటనపై పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం అయ్యాయి. ఈ నేరంపై దర్యాప్తు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం బరూయిపూర్ పోలీసు సూపరింటెండెంట్ పలాష్ చంద్ర ధాలి నేతృత్వంలో ఎనిమిది మంది సభ్యుల ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఆ తరువాత 61 రోజుల పాటు కోర్టులో విచారణ సాగింది. పోక్సో కోర్టు న్యాయమూర్తి సుబ్రతా ఛటోపాధ్యాయ శుక్రవారం దోషికి మరణ శిక్ష విధిస్తున్నట్లు ప్రకటించారు. శిక్షను ప్రకటించే సమయంలో దోషిలో ఎటువంటి పశ్చాత్తాపం కనిపించలేదన్నారు. దోషికి మరణ శిక్ష తో పాటు బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారాన్ని కోర్టు ప్రకటించింది. "మరణశిక్షతో మేం సంతోషంగా ఉన్నాం. అయితే దోషి ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి బెయిల్ పొందవచ్చు. ఇలాంటి ఘటనలు సర్వసాధారణం" అని బాధితురాలి తండ్రి మీడియాకు తెలిపారు.

అజిత్ పవార్‌కు భారీ ఊరట

న్యూఢిల్లీ, డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజే అజిత్ పవార్‌కు భారీ ఊరట లభించింది. గతంలో సీజ్ చేసిన కోట్లు విలువైన బినామీ ఆస్తులను ఆదాయపన్ను శాఖ తాజాగా క్లియర్ చేసింది. అజిత్ పవార్, అతని కుటుంబ సభ్యులు బినామీ ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలను ఆదాయ పన్నుశాఖ (ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్)కు చెందిన బినామీ ఆస్తుల లావాదేవీల నిరోధక అప్పీలెట్ ట్రిబునల్ కొట్టిపారేసింది. ఈ నేపథ్యంలో ఆయనకు ఊరట కల్పించింది. కాగా, బినామీ ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై 2021 అక్టోబర్ 7న అజిత్ పవార్‌కు చెందిన సుమారు 1000 కోట్ల ఆస్తులను ఆదాయపన్ను శాఖ సీజ్ చేసిన విషయం తెలిసిందే. ముంబైలోని నారీమన్ పాయింట్ వద్ద ఉన్న నిర్మల్ టవర్‌తో పాటు మొత్తం ఐదు ప్రాపర్టీలను ఐటీ శాఖకు అటాచ్ చేసింది. వాటిలో నిర్మల్ టవర్‌తోపాటు సతారాలోని షుగర్ ఫ్యాక్టరీ, ఢిల్లీలోని ఫ్లాట్, గోవాలోని రిసార్ట్ సహా పలు ఆస్తులు ఉన్నాయి. బినామీ ప్రాపర్టీల లబ్ధిదారుల్లో అజిత్ పవార్, ఆయన కుటుంబం ఉన్నట్లు ఆదాయపన్ను శాఖ అధికారులు అప్పుడు ఓ ప్రకటనలో తెలిపారు. అజిత్ ఫ్యామిలీపై యాంటీ బినామీ చట్టం కింద కేసు బుక్ చేశారు. అజిత్ తన ఆస్తులను న్యాయమైన పద్ధతిలో ఆర్జించలేదని ఐటీశాఖ తెలిపింది. అయితే తనకు లింకు ఉన్న అన్ని సంస్థలు క్రమ పద్ధతిలో పన్నులు చెల్లించినట్లు అజిత్ పవార్ చెప్పారు. ప్రతి ఏడాది పన్నులు చెల్లిస్తామని, ఆర్థిక మంత్రి అయినప్పటి నుంచి ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నానని, తనతో లింకున్న అన్ని కంపెనీలు పన్నులు చెల్లించినట్లు అజిత్ వెల్లడించారు.

తామూ కోరుకుంటున్నది అదే

మమత వ్యాఖ్యలపై సంజయ్ రౌత్ స్పందన

న్యూఢిల్లీ, డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): అవకాశం ఇస్తే ఇండియా కూటమి సారథ్య బాధ్యతలు చేపట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించిన విషయం తెలిసిందే. దీదీ ప్రకటనపై శివసేన (యూటీబీ) నేత సంజయ్ రౌత్ తాజాగా స్పందించారు. తాము కోరుకుంటున్నది కూడా అదే అని వ్యాఖ్యానించారు. ఈ విషయంపై మాట్లాడేందుకు త్వరలో కోల్‌కతా వెళ్లనున్నట్లు చెప్పారు. 'మమతా జీ అభిప్రాయం మాకు తెలుసు. ఆమె భారత కూటమిలో ప్రధాన భాగస్వామి కావాలనే మేమూ కోరుకుంటున్నాం. దీదీ అయినా, అరవింద్ కేజ్రీవాల్ అయినా, శివసేన అయినా.. మేమంతా కలిసే ఉన్నాం. ఈ విషయంపై మమతా బెనర్జీతో మాట్లాడేందుకు మేము త్వరలో కోల్‌కతా వెళ్తాం' అని సంజయ్ రౌత్ విలేకరుల సమావేశంలో అన్నారు. కాగా, ప్రతిపక్ష ఇండియా కూటమి పనితీరు పట్ల పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం బెంగాల్ వార్తా చానెల్ న్యూస్ 18 బంగ్లాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా తన పాత్రను కొనసాగిస్తూనే ప్రతిపక్ష కూటమికి సారథిగా వ్యవహరిస్తూ రెండు బాధ్యతలను సమర్థంగా నిర్వహించగలనని చెప్పారు. ఇండియా కూటమిని తాను ఏర్పాటు చేశానని, అవకాశం ఇస్తే కూటమి సజావుగా నడిచేలా చూసుకుంటానని మమత చెప్పారు. బెంగాల్ నుంచే కూటమిని నడిపించగలనని పేర్కొన్నారు.

కేరళ నర్సులపై భారీ కేసులు నమోదు

కొచ్చి, డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): కేరళ నర్సులపై భారీ కేసులు నమోదు అయ్యాయి. కువైట్‌కు చెందిన గల్ఫ్ బ్యాంక్ నుంచి కోట్ల రుణం తీసుకుని ఉడాయించారు. సుమారు 1400 మంది మలయాళీలు.. దాదాపు 700 కోట్ల రుణం తీసుకుని ఎగ్గొట్టినట్లు తెలుస్తోంది. సాలరీ సర్టిఫికేట్ల ను గ్యారెంటీగా పెట్టి .. గల్ఫ్ బ్యాంక్ నుంచి రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై కేరళలో దర్యాప్తు మొదలైంది. ఈ నేపథ్యంలో గల్ఫ్ బ్యాంక్‌కు చెందిన డిప్యూటీ జనరల్ మేనేజర్ కేరళను విజిట్ చేశారు. లా అండ్ ఆర్డర్ ఏడీజీపీకి ఆయన ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు ఆధారంగా ఇప్పటికే 10 కేసులు నమోదు చేశారు. ఎర్నాకుళం, కొట్టాయం జిల్లాల్లో ఆ కేసులు నమోదు అయ్యాయి. ఒక్కొక్క నర్సు సుమారు 50 లక్షల నుంచి 2 కోట్ల వరకు రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది. గల్ఫ్ బ్యాంక్ కువైట్ షేర్‌హోల్డింగ్ కంపెనీ లో మోసం జరిగినట్లు గుర్తించారు. నిందితుల్లో ఎక్కువ శాతం మంది నర్సులే ఉన్నట్లు తేలింది. డిఫాల్టర్ల వివరాలను పోలీసులకు బ్యాంకు వెల్లడించింది. ఆ వివరాల ఆధారంగా కేసులను రిజిస్టర్ చేస్తున్నారు. మూడు నెలల క్రితం బ్యాంకులో ఫ్రాడ్ జరిగినట్లు గుర్తించారు. తొలుత చిన్న రుణాలను తీసుకుని.. వాటిని సకాలంలో చెల్లించేవారు. దీంతో బ్యాంకు నమ్మకాన్ని గెలుచుకునేవారు. 2020 నుంచి 2022 మధ్య కాలంలో ఈ ఫ్రాడ్ జరిగింది. ఆ తర్వాత భారీ మొత్తంలో లోన్ తీసుకుని .. విదేశాలకు లేదా స్వంత దేశాలకు వెళ్లిపోతున్నట్లు బ్యాంక్ ఆరోపించింది. రుణం తీసుకున్న వారి లోకల్ అడ్రెస్సులు బ్యాంక్ వద్ద ఉన్నాయి. ఆ వివరాలను పోలీసులకు అందజేశారు. చాలా ప్లాన్ ప్రకారం ఫ్రాడ్ జరిగినట్లు గుర్తించిన బ్యాంకు అధికారులు.. ఈ కేసులో దర్యాప్తు కోసం కేరళ పోలీసుల్ని ఆశ్రయించారు.

కింగ్‌ఫిషర్ టవర్స్‌లో ఫ్లాట్‌ను కొనుగోలు చేసిన

ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి

న్యూఢిల్లీ, డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి లగ్జరీ అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసినట్లు తెలిసింది. బెంగళూరులోని ప్రఖ్యాత కింగ్‌ఫిషర్ టవర్స్‌లో రూ.50 కోట్లు వెచ్చించి విలాసవంతమైన ఫ్లాట్‌ను కొనుగోలు చేసినట్లు సమాచారం. నివేదికల ప్రకారం.. నాలుగు బెడ్‌రూమ్‌ల ఈ ఫ్లాట్ 8,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో 16వ అంతస్తులో ఉంది. మొత్తం ఐదు విలాసవంతమైన కార్లను పార్క్ చేసుకోవచ్చు. ముంబైకి చెందిన ఓ వ్యాపారవేత్త నుంచి ఈ ఫ్లాట్‌ను మూర్తి కొనుగోలు చేశారు. కాగా, నాలుగేళ్ల క్రితం నారాయణమూర్తి భార్య సుధామూర్తి అదే కాంప్లెక్స్‌లోని 23వ అంతస్తులో రూ.29 కోట్లతో ఫ్లాట్‌ను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. కింగ్‌ఫిషర్ టవర్స్ బెంగళూరు నడిబొడ్డున యూబీ సిటీలో ఉంది. ఇది కింగ్ ఫిషర్ అధినేత విజయ్ మాల్యా పూర్వీకుల ఇళ్లు ఉన్న స్థలం. దాదాపు 4.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలాన్ని విజయ్ మాల్యా-ప్రెస్టీజ్ గ్రూప్ రెండు కలిసి అభివృద్ధి చేశాయి. 34 అంతస్తుల కింగ్‌ఫిషర్ టవర్స్‌లో మూడు బ్లాక్‌లు ఉన్నాయి. వీటిలో 81 అల్ట్రా-లగ్జరీ అపార్ట్‌మెంట్‌లు ఒక్కొక్కటి 8,000 చదరపు అడుగుల విస్తీర్ణం కంటే ఎక్కువ స్థలంలో ఉన్నాయి. 2010లో ప్రాజెక్ట్ మొదటిసారి ప్రారంభించబడినప్పుడు, ఫ్లాట్‌లు చదరపు అడుగులకు రూ.22,000 చొప్పున అమ్ముడయ్యాయి. ప్రస్తుతం మూర్తి చదరపు అడుగు రూ.59,500తో కొనుగోలు చేసినట్లు తెలిసింది.

దూకుడు పెంచిన బీఎస్ఎన్ఎల్..

ఉచితంగా 500 ఛానెల్స్‌ను వీక్షించేలా ఐఎఫ్‌టీవీ సేవలు ప్రారంభం

హైదరాబాద్,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): ప్రముఖ ప్రభుత్వ టెలికాం సంస్థ బీఎస్ఎనల్ దూకుడుపెంచింది. తక్కువ ధరలో మంచి మంచి బెనిఫిట్స్‌తో కూడిన రీ ఛార్జ్ ప్లాన్స్‌ను అందిస్తూ ప్రైవేట్ టెలికం సంస్థలకు గట్టి పోటీనిస్తున్న బీఎస్ఎన్ఎల్ తాజాగా బ్రాడ్‌బ్యాండ్ ఆధారిత డిజిటల్ టీవీ సేవలను అందిస్తోంది. ఐఎఫ్‌టీవీ పేరుతో ఈ సేవలను ప్రారంభించింది. ఇప్పటికే కొన్ని ప్రదేశాల్లో ఈ సేవలు ప్రారంభం కాగా తాజాగా పంజాబ్‌లో కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందుకోసం బీఎస్ఎన్ఎల్ స్ట్రైప్‌తో ఒప్పందం చేసుకుంది. బీఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ వినియోగదారులు 500 కంటే ఎక్కువ లైవ్ టీవీ ఛానెల్స్‌ను ఉచితంగా వీక్షించే అవకాశం లభిస్తుంది. అన్ని ఛానెల్స్‌ను హెచ్‌డీ క్వాలిటీతో వీక్షించవచ్చు. దీంతో పాటు అదనంగా వినియోగదారులు 20 కంటే ఎక్కువ యాప్‌లకు ఉచిత యాక్సెస్‌ను కూడా పొందొచ్చు. పంజాబ్‌లో ఈ సేవలను తాజాగా బీఎస్ఎన్ఎల్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ రాబర్ట్ రవి ప్రారంభించారు. ముందుగా, చండీగఢ్‌లోని 8,000 మంది భారత్ ఫైబర్ బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులకు ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సేవలతో వినియోగదారులు సెటప్ బాక్స్ లేకుండానే టీవీని వీక్షించవచ్చు.

ఓఆర్ఆర్‌పై మరో ప్రత్యేక మార్గం

80 కోట్లతో నిర్మిస్తున్న హెచ్ఎండీఏ

హైదరాబాద్,డిసెంబర్7 (ఋషి ప్రతినిధి): హైటెక్‌సిటీ వాసులకు శుభవార్త. కోకాపేట పేరు చెప్పగానే కోట్లకు పడగలేత్తే భూములు, అక్కడే ఓ పెద్ద నియోపొలిస్ లేఅవుట్ ఉంది. దీని నుంచి అవుటర్ రింగ్ రోడ్డుపైకి నేరుగా వాహనాల రాకపోకలు సాగించేందుకు వీలుగా ఓ ప్రత్యేక మార్గం ఏర్పాటు అయింది. ఈ అతిపెద్ద లేఅవుట్ నుంచి ఓఆర్ ఆర్ పైకి వెళ్లేలా నాలుగు వరుసల్లో ప్రత్యేక మార్గం పనులు ఓ కొలిక్కి వచ్చాయి. ఇందుకోసం హెచ్ ఎండీఏ దాదాపు రూ.80 కోట్లను వెచ్చిస్తోంది. ఈ మార్గం పొడవు లేఅవుట్ నుంచి దాదాపు 1.27 కిలోమీటర్లు. కోకాపేటతో పాటు చుట్టుపక్కల నుంచి దాదాపు 15-20 లక్షల మంది నిత్యం అవుటర్ పైకి సులువుగా వెళ్లేలా అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో స్థిరాస్తి మార్కెట్ వృద్ధికి కూడా ఉపయోగపడుతుందని హెచ్ ఎండీఏ భావిస్తోంది. ఒకవైపు గండిపేట జలాశయం, మరోవైపు ఓఆర్ ఆర్ , అక్కడి నుంచి చూస్తే అద్భుతమైన స్కైనాన్షియల్ డిస్ట్రిక్ట్ , కనుచూపు మేరకు కనిపించే ఆకాశ హర్మ్యాలు, వాటి చుట్టూ గేటెడ్ కమ్యూనిటీలు, మధ్యలో 500 ఎకరాల్లో కోకాపేట లేఅవుట్. దీన్ని గతంలో హెచ్ ఎండీఏ అభివృద్ధి చేసింది. ఇప్పుడు ఇదే లేఅవుట్ హైదరాబాద్ మహానగరానికి సరికొత్త హాట్ స్పాట్ గా మారింది. అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యుత్తమ వసతులతో దీన్ని నిర్మిస్తున్నారు. విశాలమైన అంతర్గత రహదారులు. నగరానికి నలువైపులా వెళ్లేలా అనుసంధానదారులు, తాగునీటి వ్యవస్థ, మురుగునీటి వ్యవస్థ, ఇతర అన్ని సౌకర్యాలు కల్పిస్తూ హెచ్ ఎండీఏ రూ.450 కోట్లు వెచ్చించి నిర్మిస్తోంది. 2023లో ఈ లేఅవుట్ లో ఎకరం రూ100 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. స్థిరాస్తి మార్కెట్ లో ఇదొక సంచలనంగా మారింది.

కయ్యాలి చిత్రం

అనన్యా నాగళ్ల

విశ్వంభరా ఆ రోజైనా..?

చిరంజీవి 'విశ్వంభర' సినిమా కోసం మెగా అభిమానులంతా ఆతృతగా ఎదురుచూస్తున్నారు. నిజానికి ఈ సినిమా సంక్రాంతికి రావాల్సింది. కానీ 'గేమ్ చేంజర్' సంక్రాంతికి వస్తుండటంతో 'విశ్వంభర'ని వాయిదా వేయాల్సొచ్చింది. ఇటీవలే చిత్రీకరణ పూర్తిచేశారు. రిలీజ్ డేట్‌ని మాత్రం మేకర్స్ ప్రకటించలేదు. అయితే.. అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాను ఏప్రిల్ 10న విడుదల చేయడానికి నిర్మాతలు వి.రామకృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్‌రెడ్డిలు సన్నాహాలు చేస్తున్నారట. ఇదిలావుంటే.. అటు ఇటుగా అదేటైమ్‌లో ప్రభాస్ 'రాజా సాబ్' సినిమా కూడా విడుదలకు సిద్ధమవున్నది. ఏప్రిల్ రెండోవారంలో 'రాజా సాబ్' రిలీజ్ కానున్నట్లు గతంలోనే చిత్రయూనిట్ ప్రకటించింది. అయితే.. ప్రభాస్ అనుబంధ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న 'విశ్వంభర'కు పోటీగా, ప్రభాస్ 'రాజా సాబ్' రావడం జరిగే పని కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏమవుతుందో చూడాలి. ఇదిలావుండగా ఇటీవలే చిరంజీవి కొత్త సినిమా ప్రకటన వెలువడిన విషయం తెలిసిందే. యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించనున్నారు. వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో సెట్స్‌మీదకు వెళ్లనుందని సమాచారం.

తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా దిల్‌రాజు

టాలీవుడ్ అగ్ర నిర్మాత దిల్ రాజుకు తెలంగాణ ప్రభుత్వం కీలక పదవి కల్పించింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయనను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యార్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీచేశారు. ఆయన ఈ పదవిలో రెండేండ్ల పాటు కొనసాగనున్నారు. దిల్ రాజు అసలు పేరు వెంకటరమణా రెడ్డి. 1990లో పెళ్లి పందిరి సినిమాతో డిస్ట్రిబ్యూటర్‌గా కెరీర్ ప్రారంభించారు. అనంతరం దిల్ సినిమాతో నిర్మాతగా మారారు. ఆ చిత్రం విజయం సాధించడంతో ఆయన పేరు దిల్ రాజుగా మారింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై సినిమాలు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్ సినిమాలే కాకుండా చిన్ని చిత్రాలు కూడా నిర్మిస్తూ అనేకమందికి అవకాశాలు కల్పిస్తున్నారు. ఇండస్ట్రీలోకి కొత్తగా వస్తున్నవారిని ప్రోత్సహించేందుకు గాను దిల్ రాజు డ్రీమ్స్ పేరుతో కొత్త బ్యానర్ ప్రారంభిస్తున్నానని ఇటీవలే ప్రకటించారు. దీనికోసం ఒక వెబ్‌సైట్‌ను కూడా లాంచ్ చేయనున్నారు. ఆయన ప్రస్తుతం మూడు సినిమాలకు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అగ్రదర్శకుడు శంకర్, రామ్‌చరణ్ కాంబినేషన్‌లో ఆయన నిర్మించిన భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్' జనవరి 10న, వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా జనవరి 14న విడుదల కానున్నాయి. వీటితోపాటు వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'తమ్ముడు' సినిమాను దిల్ రాజు నిర్మిస్తున్నారు.

కలర్‌ఫోటో డైరెక్టర్‌తో హీరోయిన్ పెళ్లి

కలర్ ఫోటో సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సందీప్ రాజ్, నటి చాందినీ రావు మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెట్టారు. తిరుమలలో వీరిద్దరి పెళ్లి ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హీరో సుహాస్ దంపతులతో పాటు నటుడు వైవా హర్ష తదితరులు హాజరై సందడి చేశారు. సందీప్ పెళ్లికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కలర్‌ఫోటో సినిమాతో డైరెక్టర్‌గా మంచి ఫేం సంపాదించాడు సందీప్ రాజ్. ప్రముఖ యూట్యూబ్ ఛానల్ ఛాయి బిస్కెట్‌లో షార్ట్ ఫిలిమ్స్‌తో కెరీర్ మొదలుపెట్టిన ఈ యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ డెబ్యూ సినిమాగా కలర్ ఫోటో ఓటీటీలో విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది.

సాయిపల్లవితో నటించాలంటే భయం: నాగచైతన్య

టాలీవుడ్ అగ్ర కథానాయికలలో సాయిపల్లవి ఒకరు. భానుమతి హైబ్రిడ్ పిల్లా అంటూ ఫిదా సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి మొదటి సినిమాతోనే కుర్రకారు మనసులను దోచుకుంది ఈ భామ. అనంతరం మిడిల్ క్లాస్ అబ్బాయి, పడి పడి లేచే మనసు, లవ్ స్టోరీ, శ్యామ్ సింగరాయ్, విరాట పర్వం తదితర చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ భామ. ప్రస్తుతం నాగ చైతన్యతో తండేల్ అనే సినిమాలో నటిస్తుంది. అయితే రీసెంట్‌గా ఒక టాక్ షోలో పాల్గొన్న నాగ చైతన్య సాయి పల్లవి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. దగ్గుబాటి హోస్ట్‌గా చేస్తున్న టాక్ షో ది రానా దగ్గుబాటి షో. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారమవుతున్న ఈ షోలో రీసెంట్‌గా నాగ చైతన్య గెస్ట్‌గా వచ్చాడు. అయితే షోలో భాగంగా రానా సాయి పల్లవి గురించి అడుగగా.. చైతూ మాట్లాడుతూ.. సాయిపల్లవితో నటించాలి అన్న.. డాన్స్ చేయాలన్న భయం వచ్చేస్తది బావ (రానా). నువ్వు సాయిపల్లవితో విరాట పర్వం సినిమా చేసి ఒక్క సాంగ్ కూడా పెట్టకుండా భలే తప్పించుకున్నావు. కానీ నాకు అలా లేదు తనతో చేసేటప్పుడు నేను బానే చేస్తున్నానా అని సందేహం వస్తుంది అంటూ నాగ చైతన్య చెప్పుకోచ్చాడు. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

పుష్ప-2కు అండగా జాన్వీకపూర్

అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' సినిమాకు, హాలీవుడ్ చిత్రం ఇంటర్‌స్టెల్లార్ సినిమాకు సంబంధించి ఉత్తరాదిలో వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలాన్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం ఇంటర్‌స్టెల్లార్. 2014లో విడుదలైన ఈ చిత్రం హాలీవుడ్‌లోనే కాకుండా ఇండియాలోను మంచి కలెక్షన్లు సాధించింది. అయితే ఈ సినిమా 10 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మేకర్స్ రీ రిలీజ్ ప్లాన్ చేశారు.

ఈ సినిమాను ఐమాక్స్ వెర్షన్ మాత్రమే రిలీజ్ చేయనుండగా.. ఇండియాలో కాకుండా వరల్డ్ వైడ్‌గా విడుదల చేస్తుంది చిత్రబృందం. దీనికి ముఖ్య కారణం ఇండియాన్ ఐమాక్స్‌ల్లో 'పుష్ప 2' ఉండటం. దీంతో ఇండియన్స్‌కు అసలు సినిమాలు చూడడం రాదని.. సైన్స్ ఫిక్షన్ వదిలేసి మాస్ సినిమాలకు ఎంకరేజ్ చేస్తున్నారని కొందరూ కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. అయితే ఈ వివాదంపై బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ స్పందిస్తూ.. 'పుష్ప2' సినిమాకు మద్దతుగా నిలిచింది. జాన్వీ మాట్లాడుతూ.. 'పుష్ప 2' కూడా ఒక సినిమానే కదా.. ఇంటర్‌స్టెల్లార్ సినిమాతో ఈ సినిమాను పోలుస్తూ ఎందుకు తక్కువ చేస్తున్నారు. ఏ హాలీవుడ్ సినిమాను మీరు సపోర్ట్ చేస్తున్నారో వాళ్లే ఇప్పుడు ఇండియన్ సినిమాల గురించి చర్చించుకుంటున్నారు.. ప్రశంసలు కురిపిస్తున్నారు. కానీ మనం మాత్రం మన సినిమాలను తక్కువ చేసుకుంటూ మనల్ని మనమే అవమానించుకుంటూ ఉండిపోతున్నాం. ఇలాంటివి చూసినప్పుడు బాధగా ఉంటుంది అంటూ జాన్వీ రాసుకోచ్చింది. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ వైరల్‌గా మారింది.

ఇంకెప్పుడూ నటించొద్దన్నారు

'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో అభినందనలు అందుకుంటున్న అందాల రష్మిక.. తన తాజా ఇంటర్వ్యూ ద్వారా ఆనందాన్ని వ్యక్తంచేస్తూ.. పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. "శ్రీవల్లి' లాంటి పాత్ర చేసినందుకు నన్నందరూ మంచి నటి అని మెచ్చుకుంటున్నారు. కానీ నా స్కూల్ టైమ్‌లో ఓసారి స్టేజ్ షో చేశా. అది ఎవరికీ నచ్చలేదు. కొందరైతే.. 'ఇంకెప్పుడూ నటించకు' అని ఉచిత సలహా కూడా పారేశారు' అంటూ అందంగా నవ్వేసింది రష్మిక. ఇంకా చెబుతూ 'పదిమందిలో ఉన్నప్పుడు అక్కడ నన్నెవరూ నవ్వుతూ పలకరించకపోతే.. ఆ ప్రదేశంలో నేనుండలేను. అది నా బలహీనత. అంతేకాదు, కొన్ని రూమర్ల వల్ల కూడా కన్నీరు పెట్టుకున్న సందర్భాలున్నాయి. నా రెమ్యునరేషన్ గురించి ఏవేవో రాశారు. నిజానికి డబ్బు గురించి అస్సలు పట్టించుకోను. తొలి సినిమాకు తీసుకున్న పారితోషికం కేవలం రెండున్నర లక్షలు. నాకు క్యారెక్టర్ ముఖ్యం. అయితే.. డబ్బు తక్కువ ఇచ్చినా పర్లేదు కానీ.. ఫ్రీగా మాత్రం చేయకూడదనేది నా పాలసీ' అని చెప్పారు 'ఓ మంచి బయోపిక్‌లో నటించాలి. అలాగే.. 'బాహుబలి'లో దేవసేన లాంటి పాత్ర చేయాలి. ఈ రెండు కోరికలు ఎప్పుడు తీరతాయా అని ఎదురు చూస్తున్నా' అని తెలిపారు రష్మిక. ప్రస్తుతం రెయిన్‌బో, ది గర్ల్‌ఫ్రెండ్, కుబేర, సికిందర్, ఛావా, థామ చిత్రాల్లో నటిస్తూ ఆమె బిజీబిజీగా ఉన్నది.

ప్లీజ్ అలాంటి సినిమాలు తీయొద్దు: అమీర్‌ఖాన్

పురుషాధిక్యాన్ని, పితృస్వామ్య భావనలను ప్రతిబింబించే సినిమాలను తాను వ్యతిరేకిస్తానని, అలాంటి కథలు సమాజాన్ని కొన్ని ఏళ్లు వెనక్కి తీసుకెళ్తాయని వ్యాఖ్యానించారు బాలీవుడ్ అగ్ర నటుడు, మిస్టర్ పర్‌ఫెక్షనిస్ట్ అమీర్‌ఖాన్. ఇటీవల ఓ అంతర్జాతీయ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పైవిధంగా స్పం దించారు. 'గతకొంతకాలంగా మేల్ డామినేట్ స్టోరీస్ ఎక్కువగా వస్తున్నాయి. దశాబ్దాల కిందటే సమసిపోయిన పితృస్వామ్య భావాలను ప్రోత్సహించే కథాంశాలను తెరకెక్కిస్తున్నారు. అలాంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలను సాధిస్తున్నాయి. ఈ ధోరణి మంచిది కాదు. ఇప్పుడు సమాజం అన్ని రంగాల్లో ఆధునిక ఆలోచనలతో పురోగమిస్తున్నది. అయినా ఇప్పటికీ పరిష్కారించాల్సిన సామాజిక సమస్యలున్నాయి. వాటిపై దృష్టి పెడితే సమాజ అభ్యున్నతికి సృజనాత్మక మార్గంలో సహాయం చేసినవాళ్లమవుతాం. స్త్రీకి కొంతమేరకే స్వేచ్ఛనివ్వాలనే ఆలోచనలు పురుషుల్లోని అభద్రతాభావాన్ని సూచిస్తాయి. నేటి స్త్రీలు స్వీయ నిర్ణయాలతో ముందుకెళ్తున్నారు. వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత పురుషులపై ఉంది' అని అమీర్ వ్యాఖ్యానించారు. స్త్రీ సాధికారత ప్రధానాంశంగా ఆయన నిర్మించిన 'లాపతా లేడీస్' చిత్రం ప్రశంసలతో పాటు ఈ ఏడాది భారత్ నుంచి ఆస్కార్ బరిలో పోటీపడుతున్న అధికారిక చిత్రంగా నిలిచింది. ప్రస్తుతం అమీర్‌ఖాన్ 'తారే జమీన్ పర్' సీక్వెల్‌ను తెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది విడుదల కానుంది.

ఓటమి అంచున భారత్!

దారుణంగా విఫలమైన రోహిత్ శర్మ, కోహ్లీ .. మ్యాచ్‌పై పట్టు బిగించిన ఆసీస్

157 పరుగుల భారీ ఆధిక్యం.. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 128 పరుగులు

ఆస్ట్రేలియాతో జరుగుతున్న పింక్ బాల్ టెస్ట్‌లో టీమిండియా ఓటమి అంచున నిలిచింది. అద్భుతమైన బ్యాటింగ్, అసాధారణ బౌలింగ్‌తో ఈ మ్యాచ్‌పై ఆసీస్ పట్టు బిగించింది. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా అడిలైడ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ(6), మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ(11) దారుణంగా విఫలమయ్యారు. దాంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 24 ఓవర్లలో 5 వికెట్లకు 128 పరుగులు చేసింది. క్రీజులో రిషభ్ పంత్(28 బ్యాటింగ్), నితీష్ కుమార్ రెడ్డి(15 బ్యాటింగ్) ఉన్నారు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్కాట్ బోలాండ్, ప్యాట్ కమిన్స్ రెండేసి వికెట్లు తీయగా.. మిచెల్ స్టార్క్ ఓ వికెట్ పడగొట్టాడు. అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 87.3 ఓవర్లలో 337 పరుగులకు ఆలౌటైంది. దాంతో ఆ జట్టుకు 157 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. ఆసీస్ బ్యాటర్లలో ట్రావిస్ హెడ్(141 బంతుల్లో 17 ఫోర్లు, 4 సిక్స్‌లతో 140) విధ్వంసకర సెంచరీతో చెలరేగగా.. మార్నస్ లబుషేన్(126 బంతుల్లో 9 ఫోర్లతో 64) హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్(4/98), జస్‌ప్రీత్ బుమ్రా(4/61) నాలుగేసి వికెట్లు తీయగా.. నితీష్

కుమార్ రెడ్డి, రవిచంద్రన్ అశ్విన్ చెరో వికెట్ పడగొట్టారు. భారత్ ఇంకా 29 పరుగుల వెనుకంజలో ఉంది. ఇక రెండో రోజు ఆటలో టీమిండియా పూర్తిగా తేలిపోయింది. మూడు సెషన్లలో ఆసీస్ ఆధిపత్యమే నడిచింది. మూడో రోజు ఆటలో పంత్, నితీష్ కుమార్ రెడ్డి అద్భుతం చేస్తే తప్పా ఈ మ్యాచ్‌లో టీమిండియా ఓటమి నుంచి గట్టెక్కదు. 86/1 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన ఆసీస్‌కు శుభారంభం దక్కలేదు. టీమిండియా స్టార్ పేసర్ బుమ్రా అద్భుత బౌలింగ్‌తో.. ఓవర్‌నైట్ బ్యాటర్ నాథన్ మెక్‌స్వీనీ(39)తో పాటు స్టీవ్ స్మిత్(2)ను పెవిలియన్ చేర్చాడు. ఈ పరిస్థితుల్లో లబుషేన్, ట్రావిస్ హెడ్ కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. 55 పరుగుల భాగస్వామ్యంతో పాతుకుపోయిన ఈ జోడీని నితీష్ కుమార్ రెడ్డి విడదీసాడు. లబుషేన్‌ను జైస్వాల్ సాయంతో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి మిచెల్ మార్ష్ రాగా.. ట్రావిస్ హెడ్ 63 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో ఆసీస్ 200/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే మిచెల్ మార్ష్(9)ను అశ్విన్.. ఔట్ చేయగా.. మరోవైపు ట్రావిస్ హెడ్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. వన్డే తరహా బ్యాటింగ్‌తో బౌండరీల మోత మోగించాడు. ఈ క్రమంలో అతను 111 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో అలెక్స్ క్యారీ(15)ని సిరాజ్ ఔట్ చేయడంతో 6వ వికెట్‌కు నమోదైన 74 పరుగుల భాసగ్వామ్యానికి తెరపడింది. సెంచరీ అనంతరం ట్రావిస్ హెడ్ మరింత దూకుడుగా ఆడాడు. కానీ అతన్ని సిరాజ్ స్టన్నింగ్ యార్కర్‌తో క్లీన్ బౌల్డ్ చేశాడు. ప్యాట్ కమిన్స్(12)ను బుమ్రా ఔట్ చేయడంతో ఆసీస్ 332/8 టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్ తొలి బంతికే మిచెల్ స్టార్క్‌ను క్యాచ్ ఔట్ చేసిన సిరాజ్.. తన మరుసటి ఓవర్‌లో స్కాట్ బోలాండ్(0)ను క్లీన్ బౌల్డ్ చేసి ఆసీస్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. 157 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా వరుసగా వికెట్లు కోల్పోయింది. ఆసీస్ వ్యూహాలను పసిగట్టలేక వికెట్లను పారేసుకుంది. కేఎల్ రాహుల్(7)తో మొదలైన భారత వికెట్ల పతనం.. రోహిత్ శర్మ(6)వరకు కొనసాగింది. అచితూచి ఆడిన యశస్వి జైస్వాల్(24), శుభ్‌మన్ గిల్‌లు కూడా పెవిలియన్ చేరారు. భారీ అంచనాలతో బ్యాటింగ్‌కు వచ్చిన కోహ్లీ.. మరోసారి ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ బలహీనతతో మూల్యం చెల్లించుకున్నాడు. రోహిత్ శర్మ అయితే తీవ్రంగా తడబడి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. చివర్లో పంత్, నితీష్ కుమార్ రెడ్డి దూకుడుగా ఆడటంతో భారత్ మరో వికెట్ కోల్పోలేదు. కోహ్లీ, రోహిత్ మెరుగ్గా బ్యాటింగ్ చేసి ఉంటే ఈ మ్యాచ్‌లో భారత్ పై చేయి సాధించేదని క్రికెట్ ఎక్స్‌పర్ట్స్ భావిస్తున్నారు.

హెడ్‌తో సిరాజ్ ఘర్షణ

అడిలైడ్‌లో భారత్-ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న పింక్ బాల్ టెస్టు రెండో రోజు మహ్మద్ సిరాజ్, ట్రావిస్ హెడ్ తలపడ్డారు. మైదానం మధ్యలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. అయితే భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌లో ఇలాంటి చిత్రాలు కనిపించడం మామూలే. అయితే, అడిలైడ్‌లో సిరాజ్, హెడ్ ఒకరినొకరు ఆగ్రహంతో ఊగిపోవడానికి ఓ కారణం ఉంది. ఈ గొడవ తెలియాలంటే ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్‌లోని 82వ ఓవర్‌లో ఏం జరిగిందో చూడాల్సిందే. సిరాజ్ వేసిన ఓవర్లో 4 బంతుల్లో వాతావరణం అంతా మారిపోయింది. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 82వ ఓవర్ వేయడానికి వచ్చిన సిరాజ్ వేసిన తొలి బంతికి ట్రావిస్ హెడ్ ఫోర్ కొట్టాడు. ఆ తర్వాత రెండో బంతికి అతను రన్ చేయలేకపోయాడు. సిరాజ్ వేసిన ఈ ఓవర్ మూడో బంతికి హెడ్ సిక్స్ కొట్టాడు. ఆ తర్వాత నాలుగో బంతికి సిరాజ్ వికెట్లను చెదరగొట్టాడు. ఆ తర్వాత సిరాజ్ ఆవేశంలో ఊగిపోయాడు. ఈ క్రమంలో హెడ్ కూడా ధీటుగా సిరాజ్ వైపు చూస్తూ ఏదో అన్నాడు. ఈ క్రమంలో ఇద్దరు ఆటగాళ్లు ఒకరినొకరు చూసుకుంటూ దూకుడుగా కనిపించారు. భారత్‌పై హెడ్‌కి ఉన్న ప్రేమ ప్రపంచ క్రికెట్‌లో ప్రసిద్ధి చెందింది. అడిలైడ్‌లో కూడా అతను టీమ్ ఇండియాపై సెంచరీతో చెలరేగాడు. అడిలైడ్ టెస్టులో, అతను 141 బంతుల్లో 17 ఫోర్లు, 4 సిక్సర్లతో 140 పరుగులు చేశాడు. భారత్‌పై చివరి 6 ఇన్నింగ్స్‌ల్లో ఇది అతనికి రెండో సెంచరీ, నాలుగో ఫిఫ్టీ ప్లస్ స్కోరు. ట్రావిస్ హెడ్ సెంచరీతో ఆస్ట్రేలియా తన మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ స్కోర్‌ను దాటడమే కాకుండా భారీ ఆధిక్యాన్ని కూడా సాధించింది. భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులు చేసింది. అడిలైడ్ టెస్టులో ఇంకా 3 రోజుల ఆట మిగిలి ఉంది. ఈ మ్యాచ్ ఫలితం తేలిపోతుందని ఇప్పటికే అర్థమైంది. రెండో రోజు మూడో సెషన్‌లో ఆస్ట్రేలియా 337పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో ఆసీస్ జట్టు 157 పరుగుల ఆధిక్యం సాధించింది. ఇక భారత బౌలర్లలో సిరాజ్, బుమ్రా తలో 4 వికెట్లు పడగొట్టారు.

డే/నైట్ టెస్ట్ చరిత్రలోనే అత్యంత వేగంగా శతకం

చరిత్ర సృష్టించిన ట్రావిస్ హెడ్

ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ చరిత్ర సృష్టించాడు. డే/నైట్ టెస్ట్ చరిత్రలోనే అత్యంత వేగంగా శతకం బాదిన బ్యాటర్‌గా నిలిచాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా టీమిండియాతో అడిలైడ్ వేదికగా జరుగుతున్న పింక్ బాల్ మ్యాచ్‌లో ట్రావిస్ హెడ్ 111 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకొని ఈ ఫీట్ సాధించాడు. ఈ క్రమంలో తన పేరిట ఉన్న రికార్డ్‌ను తనే తిరిగ రాసాడు. 2022లో ఇంగ్లండ్‌తో హోబర్ట్ వేదికగా జరిగిన పింక్ బాల్ మ్యాచ్‌లో 112 బంతుల్లో శతకం సాధించాడు. పింక్ బాల్ టెస్ట్‌ల్లో అత్యంత వేగంగా శతకం బాదిన టాప్-3 బ్యాటర్లలో ట్రావిస్ హెడ్ ఉన్నాడు. వెస్టిండీస్‌తో ఓవల్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో 125 బంతుల్లో ట్రావిస్ హెడ్ శతకం సాధించాడు. పింక్ బాల్ టెస్ట్ చరిత్రలోనే అత్యధిక సెంచరీలు బాదిన రెండో ఆసీస్ బ్యాటర్‌గా ట్రావిస్ హెడ్ రికార్డ్ సాధించాడు. ఈ జాబితాలో మార్నస్ లబుషేన్ 4 శతకాలతో టాప్‌లో ఉండగా.. ట్రావిస్ హెడ్ మూడు సెంచరీలతో రెండో స్థానంలో నిలిచాడు. ఓవరాల్‌గా ట్రావిస్ హెడ్‌కు ఇది 8వ శతకం.ట్రావిస్ హెడ్(141 బంతుల్లో 17 ఫోర్లు, 4 సిక్స్‌లతో 140) విధ్వంసకర శతకంతో ఈ మ్యాచ్‌పై ఆసీస్ పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ దిశగా సాగుతున్న ఆసీస్ ఇప్పటికే 147 పరుగుల ఆధిక్యాన్ని సొంతం చేసుకుంది. ట్రావిస్ హెడ్‌తో పాటు మార్నస్ లబుషేన్(126 బంతుల్లో 9 ఫోర్లతో 64) హాఫ్ సెంచరీతో రాణించాడు. ప్రస్తుతం క్రీజులో ప్యాట్ కమిన్స్(8 బ్యాటింగ్), మిచెల్ స్టార్క్(17 బ్యాటింగ్) ఉన్నారు.

మిచెల్ మార్ష్ వికెట్.. వివాదం

అడిలైడ్ టెస్టులో థర్డ్ అంపైర్ నిర్ణయం సంచలనం సృష్టించింది. పెర్త్ టెస్టు తర్వాత మరోసారి టీమ్‌ఇండియాపై చెత్త నిర్ణయాలు తీసుకుంటుందంటూ ఆరోపణలు వస్తున్నాయి. నిజానికి, పింక్ బాల్ టెస్ట్ రెండో రోజున, అశ్విన్ వేసిన బంతికి మిచెల్ మార్ష్ ఎల్‌బీడబ్ల్యూ అప్పీల్ చేశారు. దానిని ఫీల్డ్‌లో ఉన్న అంపైర్ నాటౌట్‌గా ప్రకటించాడు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా భారత జట్టు డీఆర్ఎస్‌ను ఉపయోగించినప్పటికీ విజయం సాధించలేదు. ఎందుకంటే, సరైన విచారణ లేకుండానే థర్డ్ అంపైర్ మార్ష్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నాడు. అంపైర్ నిర్ణయంతో భారత ఆటగాళ్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 64వ ఓవర్లో మార్ష్ వికెట్ పడటంతో వివాదం నెలకొంది. ఈ ఓవర్ నాలుగో బంతికి ఎల్‌బీడబ్ల్యూ కోసం అప్పీల్ వచ్చింది. టీమ్ ఇండియా సమీక్షించినప్పుడు, థర్డ్ అంపైర్ స్నికో మీటర్‌ను మాత్రమే తనిఖీ చేశాడు. ఏకకాలంలో వచ్చిన శబ్దం కారణంగా, బంతి ముందుగా మార్ష్ బ్యాట్‌కు తగిలిందని భావించాడు. ఈ విషయంలోనే వివాదం నడుస్తోంది. ప్రోటోకాల్ ప్రకారం, ఇటువంటి పరిస్థితులలో బాల్ ట్రాకింగ్, అల్ట్రా ఎడ్జ్ గమనించాల్సి ఉంటుంది. కానీ, థర్డ్ అంపైర్ దానిని తనిఖీ చేయలేదు.

సిరాజ్ 181.6 కిలోమీటర్లు

క్రికెట్ చరిత్రలో అత్యంత వేగవంతమైన బాల్

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ రెండో టెస్ట్ మ్యాచ్ డిసెంబర్ 6 నుంచి భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య జరుగుతోంది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో భారత జట్టు 295 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఇప్పుడు అడిలైడ్ ఓవల్‌లో పింక్ బాల్ టెస్టులో మాత్రం తొలి ఇన్నింగ్స్‌లో తడబడింది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో భారత బ్యాట్స్‌మెన్ మౌనంగా ఉండగా, ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ విధ్వంసం సృష్టించాడు. ఇక బౌలింగ్ ప్రారంభించిన భారత్.. వికెట్ల కోసం తహతహలాడుతున్నారు. ఈ క్రమంలో మహ్మద్ సిరాజ్ తన బంతులలో ఆసీస్ బౌలర్లకు దడపుట్టిస్తున్నాడు. ఇందులో ఓ బంతి సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. అడిలైడ్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భారత బౌలర్లు వికెట్ల కోసం కష్టపడుతున్నారు. జస్ప్రీత్ బుమ్రాకు ఏకైక వికెట్ దక్కింది. హర్షిత్ రాణా, మహ్మద్ సిరాజ్‌ల వికెట్ల కాలమ్ ఖాళీగా ఉంది. అయితే, సిరాజ్ తన బంతితో చర్చను వేడెక్కించాడు. ఒక వైరల్ వీడియోలో మీరు సిరాజ్ గంటకు 181.6 కిలోమీటర్ల వేగంతో బంతిని బౌలింగ్ చేయడాన్ని చూడొచ్చు. ఈ సంఘటన సిరాజ్ 10వ ఓవర్ అంటే ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 25వ ఓవర్ సమయంలో ఇది చోటు చేసుకుంది. క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు ఏ బౌలర్ కూడా గంటకు 162 కిలోమీటర్ల వేగంతో బంతిని వేయలేకపోయాడు. గంటకు 181.6 కి.మీ వేగంతో బౌలింగ్ చేయడం ఇందులో చూడొచ్చు. అయితే, సిరాజ్ ఈ బాల్ డెలివరీ సమయంలో, స్పీడ్ గన్‌లో లోపం ఏర్పడి ఉండవచ్చు. దాని కారణంగా బంతి వేగం తప్పుగా చూపించినట్లు తెలుస్తోంది. క్రికెట్ మ్యాచ్‌లలో స్పీడ్ గన్‌లు పనిచేయకపోవడం కొత్త విషయం కాదు. ప్రపంచ క్రికెట్‌లో అత్యంత వేగంగా బంతి వేసిన రికార్డు పాకిస్తాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ షోయబ్ అక్తర్ పేరిట ఉంది. ఆ సమయంలో, అక్తర్ తన పదునైన బౌలింగ్‌తో ప్రతి బ్యాట్స్‌మన్‌లో భయాన్ని సృష్టించాడు. 2003 వన్డే ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌తో ఆడుతున్నప్పుడు అతను గంటకు 161.3 కిలోమీటర్ల వేగంతో బంతిని వేశాడు. అతని ఈ రికార్డు 21 ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉంది. అదే ఓవర్‌లో అక్తర్ గంటకు 153.3, 158.4, 158.5, 157.4, 159.5 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేయడం గమనార్హం. బ్యాట్స్‌మెన్ నిక్ నైట్ ముందున్నాడు. అక్తర్ ఈ ఓవర్ మెయిడిన్ ఓవర్ బౌలింగ్ చేయడం గమనార్హం.

బీసీసీఐకి యూసుఫ్ పఠాన్ మద్దతు

భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) వచ్చే ఏడాది ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టును పాకిస్తాన్‌కు పంపకూడదన్న నిర్ణయానికి మాజీ ఆల్‌రౌండర్ యూసుఫ్ పఠాన్ పూర్తి మద్దతు తెలిపారు. యూసుఫ్, భారత్‌ను 2011 ప్రపంచకప్, 2007 టీ20 ప్రపంచకప్ విజయాల్లో కీలక పాత్ర పోషించిన ఆటగాడు, ఈ నిర్ణయాన్ని సమర్థిస్తూ బీసీసీఐ ఆటగాళ్ల భద్రతను ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యంగా చూసుకుంటుందని కొనియాడాడు."బీసీసీఐ ఎల్లప్పుడూ ఆటగాళ్ల భద్రతను, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుంటుంది. కాబట్టి బోర్డు తీసుకున్న ఏ నిర్ణయం అయినా ఈ రెండు అంశాలకే అనుగుణంగా ఉంటుంది," అని యూసుఫ్తో అన్నారు.ఇదిలా ఉండగా, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మొత్తం టోర్నమెంట్‌ను పాకిస్తాన్‌లో నిర్వహించాలన్న దృఢసంకల్పంతో ఉన్నది. కానీ తాజా పరిణామాలు ఈ నిర్ణయంపై కొంత మార్పు తెచ్చే అవకాశాలు చూపుతున్నాయి. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ , పీసీబీ 2027 వరకు జరిగే టోర్నమెంట్లలో హైబ్రిడ్ మోడల్‌ను అనుసరించేందుకు సూత్రప్రాయంగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు నివేదికలు వెలువడినాయి.ఈ హైబ్రిడ్ మోడల్ ప్రకారం, రెండు దేశాలు తటస్థ వేదికపై తమ ఆటలను ఆడే అవకాశం ఉంటుంది. కానీ 2025 ఛాంపియన్స్ ట్రోఫీకి అధికారిక హోస్ట్ ఇప్పటివరకు వ్యాఖ్యానాలు చేయలేదు.

కురుక్షేత్రం

శ్రీకృష్ణుడు నిజమా? అబద్ధమా? ఏలియనా? ఇదొక విచిత్రమైన ప్రశ్న.. కానీ ఈ ప్రశ్నకు ఎవరైనా జవాబు చెప్పగలరా? శ్రీకృష్ణుడు నిజంగా భూమ్మీద పుట్టాడా? లేదా? పుడితే ఎప్పుడు పుట్టాడు? ఎన్నేళ్లు ఈ భూమ్మీద ఉన్నాడు? ఇవన్నీ ఎవరికైనా తెలుసా? భాగవతంలో.. భారతంలో శ్రీకృష్ణుడి గురించి చాలా చాలా కథలు ఉన్నాయి. పుట్టినప్పటి నుంచీ కురుక్షేత్ర సంగ్రామం దాకా రకరకాల లీలలతో అలరించిన వాడు కృష్ణుడు. అవన్నీ నిజమేనా? లేక కృష్ణుడు గ్రహాంతర వాసా?

కృష్ణుడు
నిజమా? అబద్ధమా?

ఇంతకీ కృష్ణుడు నిజమా అబద్ధమా అన్న డౌట్ ఎందు కొచ్చింది? మీకు తెలిస్తే చెప్పండి.. లేకుంటే ఆలోచించండి.. అదీ కష్టమ సుకుంటే ఈ వ్యాసం చదవండి. శ్రీకృష్ణుడు ఎవరు? ఒక ప్రశ్నకు.. వంద జవాబులు చెప్పవచ్చు... ప్రేమకు ఓ అకారాన్ని కల్పిస్తే దాని పేరు కృష్ణుడు.. ఉదాత్తమైన ప్రేమ భావుకులు రాధాకృష్ణులు, గోపికల శ్వాస.. ప్రాణాలు అన్నీ కృష్ణుడే.. కుచేలుడికి ఓ మంచి స్నేహితుడూ కృష్ణుడే.. జగత్తుకే గొప్ప గురువు.. భగవద్గీతను అందించిన గీతాచార్యుడు. అంతకుమించి రాజనీతిజ్ఞుడు, రణతంత్రవేత్త.. విజయుడికి సారథి.. విజయానికే సారథి. తాను ఆయుధం పట్టకుండానే పాండవులకు విజయాన్ని కట్టబెట్టిన థింక్ట్యాంక్, పుట్టినప్పటి నుంచే మృత్యువుతో చెలగాటమాడిన వాడు. తాను చెప్పినట్టల్లా మృత్యువును ఓ ఆటాడించిన వాడు. కానీ, ఆయన ఓ ఏలియన్ అంటే ఓ గ్రహాంతర వాసి అంటున్నారు..... ఇదీ ఇప్పుడు ప్రపంచమంతటా జరుగుతున్న చర్చ..

కోవెల సంతోష్ కుమార్
ప్రముఖ సీనియర్ జర్నలిస్టు

(సేకరణ: దేవ రహస్యం)

దీనిపై తెగ పరిశోధనలు జరుగుతున్నాయి. ఇందులో ఏది నిజం..? దేవుడా.. గ్రహాంతరవాసా? అసలు ఆయన అస్తిత్వం నిజమా? అబద్ధమా? భాగవతం.. మహాభారతం.. శ్రీకృష్ణుడి ఉనికిని చాటే రెండు ఇతిహాసాలు.. భాగవతంలో శ్రీకృష్ణుడి కథ ప్రధానంగా ఉన్నా.. రకరకాల కథనాల సమాహారమది.. మహాభారతం తెలిసిందే.. కురుపాండవుల కథ.. ఈ రెంటిలోనూ కీలక పాత్రధారి కృష్ణుడే. మనకు తెలిసినంత వరకు ఈ కృష్ణుడు చిన్ననాటి నుంచే చాలా లీలలు చూపించాడు. పసివాడుగా ఉన్నప్పుడే పూతనాది రాక్షసులను హతమార్చాడు. రేపల్లె ప్రజలను కాపాడాడు. పెద్దవాడైన తరువాత పాండవుల పక్షాన నిలుచుని కురుక్షేత్ర సంగ్రామాన్ని అంతా తానే అయి నడిపించాడు. ఎవరిని ఎప్పుడు ఎక్కడ ఎలా ఏం చేయాలో బాగా తెలిసిన వాడు కాబట్టే జగద్గురువు అయ్యాడని అంతా పూజిస్తున్నాం.

కానీ, కృష్ణుడిని గ్రహాంతర వాసి అంటే హిందూ ధార్మిక వాదులు విశ్వసించరు. హేతువాదులు అస్సలు నమ్మరు. అసలు దేవుడనే కాన్సెప్ట్ వ్యతిరేకం అయినప్పుడు ఎక్స్ట్రా టెరెస్ట్రియల్ ఆబ్జెక్ట్స్ ను ఒప్పుకోవటం ఎలా సాధ్యపడుతుంది? వీటన్నింటినీ ఫాంటసీ స్టోరీలుగా చెప్పుకోవటమే విచిత్రం. కృష్ణుడు భారతీయులకు సంబంధించిన, భారతీయతకు సంబంధించిన అపురూపమైన చరిత్ర, కృష్ణుడికి సంబంధించిన అనేక రకాల ఆధారాలు ఎవరో విదేశీ ఓషనోగ్రాఫిక్ సైంటిస్టులకు దొరికితే కానీ నమ్మలేని దురదృష్టమైన పరిస్థితి నెలకొనటం ఈ దేశంలో ఉండిపోయింది. ఇవిగో కృష్ణుడి ఉనికిని చాటే ఆనవాళ్లు ఇవి అని చెప్పుకోవాల్సిన పరిస్థితి మనది. ఈ కృష్ణుడు గ్రహాంతర వాసులతో రాకపోకలు సాగించారా? యుద్ధం చేశాడా అన్నది తెలియదు. కానీ, ఎక్స్ట్రా టెరెస్ట్రియల్ ఆబ్జెక్ట్స్ కృష్ణుడికి స్పష్టమైన సంబంధాలు వున్నట్లు ఆస్ట్రో సైంటిస్టులు భావిస్తున్నారు. కృష్ణుడు అబద్ధం కాదు.. నిజమేనన్న అంచనాకు వచ్చేశారు. హిందూయిజానికి సంబంధించిన గ్రంథాలు.. కథలు.. పుక్కిటి పురాణాలుగా వేల ఏళ్లుగా చర్చించటానికి కారణాలు చాలానే ఉన్నాయి. హేతువాదులు వీటిని నమ్మరు. అంగీకరించరు. ఇదమిత్థమైన చారిత్రక ఆనవాళ్లు ఏవీ దొరకలేదన్న కారణంతో నిక్కచ్చిగా తిరస్కరిస్తారు. ఈ పద్ధతి భారతీయ హేతువాదులకే చెల్లింది. కానీ, అస్ట్రోనాట్ సైంటిస్టుల లెక్కలు రామాయణ, భారత కాలాన్ని ఖచ్చితంగా నిర్ధారిస్తున్నాయి. భారత భాగవతాల్లో అనేక లీలలను ప్రదర్శించిన శ్రీకృష్ణుడి చరిత్ర వాస్తవమేనని ఖచ్చితంగా చెప్తున్నాయి. ఇప్పుడు ఆస్ట్రో సైంటిస్టుల వాదనా ఇందుకు అనుకూలంగానే స్పష్టమైంది.

భారత రామాయణాలను ఇప్పటికీ కేవలం కావ్యాలుగానో, ఇతిహాసాలుగానో పరిగణించటం తప్ప చరిత్రగా చెప్పుకోవటానికి మనలో మనకే బోలెడు విభేదాలు, భిన్నాభిప్రాయాలు, అంతర్జాతీయ స్థాయిలో సైతం దీనిపై పెద్ద ఎత్తున పరిశోధన జరిగింది. ఎందుకంటే మన నాగరికతకు.. సంస్కృతికి మూలాలు ఇవే కాబట్టి వీటి రహస్యాన్ని ఛేదించటం అవసరమైంది. రష్యా, గ్రేట్ బిటన్, దక్షిణ అమెరికాలకు చెందిన సైంటిస్టులు మహాభారత కాలాన్ని ఖచ్చితంగా తేల్చారు. ఈ లెక్కల ప్రకారం మహాభారతం నేటికి సరిగ్గా 5240 సంవత్సరాలకు ముందు జరిగింది. శ్రీకృష్ణుడు ఎప్పుడు పుట్టాడన్నది భాగవతంలోని పదవ స్కంధంలో వివరంగా ఉంది. శ్రావణ మాసం, కృష్ణపక్షం, అష్టమి తిథి, రోహిణీ నక్షత్రం ఉన్న సమయంలో శ్రీకృష్ణుడు మధురలోని కంసుడి జైలులో జన్మించాడు. భూమధ్య రేఖకు 27.25 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 77 డిగ్రీల తూర్పు రేఖాంశంపై ఉన్న ప్రదేశంలో జగన్నాథుడు పుట్టాడు.

ఆయన జన్మించిన సమయంలో వివిధ గ్రహాలు రకరకాల డిగ్రీల్లో సంచరిస్తున్నాయి. సూర్యుడు 139.48 డిగ్రీల కోణంలో ఉన్నాడు. చందుడు 42 డిగ్రీల కోణంలో.. అంగారకుడు 91 డిగ్రీల కోణంలో, బుధుడు 152 డిగ్రీలలో, గురువు 148, శుక్రుడు 104, శని 224 డిగ్రీల కోణాల్లో సంచరిస్తున్నారు. శ్రీకృష్ణుడు పుట్టినప్పుడు చంద్ర మహాదశ నడుస్తోంది. ఈ గణాంకాలను ఆధారం చేసుకుని శ్రీకృష్ణుడి జన్మకాలాన్ని లెక్కిస్తూ వెళ్లారు. ఈ పరిశోధనల సారాంశం ప్రకారం శ్రీకృష్ణుడు క్రీస్తుపూర్వం 3228, జూలై 19 బుధవారం నాడు జన్మించాడు. ఈ భూమ్మీద మొత్తం 125 సంవత్సరాలు జీవించి తిరిగి తన లోకానికి వెళ్లిపోయాడు. ఈ 125 సంవత్సరాలలో ఆయన చూపించిన లీలలు.. చేసిన కార్యాలు అన్నీ ఇన్నీ కావు.. ఒక మనిషి సామాన్యుడిగా జన్మించి మహానుభావుడిగా ఎదిగిన తీరుకు శ్రీకృష్ణుడు రోల్ మాడల్‌గా నిలిచాడు. కృష్ణుడి కాలనిర్ణయంపై ఒకటిన్నర దశాబ్ద కాలంగా పెద్ద చర్చే జరుగుతోంది. వాదోపవాదాలు జరిగాయి. ఆస్ట్రో సైంటిస్టుల రిసెర్చ్‌ను కాదన్న వాళ్లూ ఉన్నారు. కానీ, చివరకు కృష్ణుడు కేవలం ఒక కేరెక్టర్ కాదు.. ఆయన ఒక చరిత్ర.. ఒక గొప్ప సమాజపు నాగరికతా వికాసానికి మూలపురుషుడని నిర్ధారణకొచ్చారు.

జ్యోతిష్యం ప్రకారమైనా, అస్ట్రో థియరీ ప్రకారమైనా శ్రీకృష్ణుడు క్రీస్తు పుట్టడానికి 3228 సంవత్సరాలకు ముందు జూలై 10 బుధవారం మధురలోని కంసుడి జైల్లో జన్మించాడు. అంటే ద్వాపర యుగం ప్రారంభమైన తరువాత 8,63,874వ సంవత్సరం అయిదో నెల 22వ రోజున కృష్ణుడు పుట్టాడన్నమాట. ఇందులో ఇప్పుడిక వివాదాలకు తావు లేదు. పుట్టడంతోనే చావుతో పోరాడాల్సిన పరిస్థితి కృష్ణుడిది. జన్మించిన వెంటనే కంసుడు చంపేస్తాడన్న భయంతో మధుర నుంచి రాత్రికి రాత్రి గోకులానికి పారిపోవలసి వచ్చింది. తండ్రి వసుదేవుడు అతణ్ణి గోకులానికి తరలించిన తరువాత ఆయన యశోదాదేవి దగ్గర పెరిగాడు, గోకులంలో కూడా కృష్ణుడు ఎక్కువకాలం వుండలేక పోయాడు. ఆయన అక్కడ పెరిగింది కేవలం మూడు సంవత్సరాల నాలుగు నెలలు. ఈ మూడేళ్ల కాలంలోనే కృష్ణుడిపై చాలా సార్లు హత్యాయత్నం జరిగింది. పూతన, శకటాసురుడి లాంటి వాళ్లు బాలకృష్ణుణ్ణి చంపేందుకు ప్రయత్నించారు. వీటి ఆనవాళ్లు మనకు ఇప్పటికీ మధురకు దగ్గర్లోని గోకులంలో కనిపిస్తాయి. క్రీస్తు పూర్వం 3225 నవంబర్-డిసెంబర్ మధ్యన కృష్ణుడిని గోకులం నుంచి బృందావనానికి తరలించారు. అక్కడ మరో నాలుగేళ్ల పాటు ఎదిగాడు, ఇక్కడే ఆయన ముగ్గురు రాక్షసులను చంపాడు. ఏడేళ్ల వయసు వచ్చేసరికి బృందావనానికి దగ్గర్లో ఉన్న నంద్‌గావ్‌కు కృష్ణుడు చేరుకున్నాడు. పదో ఏడు వచ్చేంత వరకూ కృష్ణుడు అక్కడే వున్నాడు. ఈ మధ్య కాలంలోనే ఆయన గోపికలకు బృందావనంలో రాసలీలలను చూపించాడు. అపురూపమైన మధుర భక్తిని రుచి చూపించాడు. నంద్‌గావ్‌లో ఉన్న సమయంలోనే ఆయన తన ప్రజల్ని కాపాడటానికి గోవర్ధనగిరి పర్వతాన్ని ఎత్తాడు. ఆ పర్వతం ఇప్పటికీ మనకు అక్కడ కనిపిస్తుంది. ఇక్కడికి వెళ్లినవారు ఈ గిరి ప్రదక్షిణం చేయకుండా రారు. కృష్ణుడికి పదేళ్ల వయసు వచ్చేసరికి దాదాపు ఏడుగురు రాక్షసులను హతమార్చాడు. వీళ్లంతా కంసుడు పంపించిన వాళ్లే., దీంతో కంసుడు తానే రంగంలోకి దిగాడు. బలరామకృష్ణులను రాయబారం చేసి తిన్నగా తన మధురకు రప్పించుకున్నాడు. అప్పటికి కృష్ణుడి వయసు సరిగ్గా 10 సంవత్సరాల ఎనిమిది నెలలు.

కంసుడి మధురకు కృష్ణుడు వెళ్లింది క్రీస్తుపూర్వం 3216 మార్చి నెలలో.. చైత్ర శుక్ల ఏకాదశి నాడు ఆయన మధురలో ప్రవేశించాడు, రెండు రోజుల తరువాత అంటే చతుర్దశి రోజున కంసుడిని హతమార్చాడు. కంసుడిని చంపిన తరువాత కృష్ణుడు మధురలోనే వున్నాడు. తల్లిదండ్రులను చెరవిడిపించిన తరువాత వారితోనే ఉండిపోయాడు. అయినా బృందావనానికి అప్పుడప్పుడూ వెళ్లి వస్తుండేవాడు. అక్కడే ఆయన అద్భుతమైన రాసలీలలను ప్రదర్శించాడు, గోపికలు ఆయన పట్ల వివశులైపోయారు. అన్నీ వదిలేసి కృష్ణుడి కోసం వచ్చేశారు. ఆ బృందావనానికి పట్టమహిషి రాధ, ఉజ్వల రసవైచిత్రికి బృందావనం ఒక భూమికగా నిలిచింది. ఆయనకు పదిహేను సంవత్సరాల వయసుమొచ్చేంతవరకూ రాసలీలలు కొనసాగాయి. ఆ తరువాత ఆయన చదువు కోసం గురువు సాందీపని దగ్గరకు వెళ్లాల్సి వచ్చింది. అప్పటికి ఆయన వయస్సు సరిగ్గా 15 సంవత్సరాల 9 నెలల 7 రోజులు, ఆనాటికి రాధాదేవి వయస్సు 14 సంవత్సరాల 2 నెలల 15 రోజులు. క్రీస్తుపూర్వం 3212 ఏప్రిల్ 26వ తేదీన శ్రీకృష్ణుడు విద్యాభ్యాసాన్ని సాందీపని గురువు దగ్గర ప్రారంభించాడు. దాదాపు పదేళ్ల పాటు ఆయన చదువు కొనసాగించాడు. తనకు 28 సంవత్సరాల 4 నెలల వయసు వచ్చే వరకు కృష్ణుడు మధురలోనే ఉన్నాడు.

అప్పుడే మగధ రాజు జరాసంధుడితో గొడవ వచ్చిపడింది. దీంతో తన ప్రజల్ని కాపాడేందుకు అరేబియా సముద్ర తీరంలో ద్వారకను నిర్మించాడు. క్రీస్తుపూర్వం 3199 నవంబర్ లో కృష్ణుడు మధురను వదిలి ద్వారకకు తన ప్రజలతో సహా తరలిపోయాడు. అయితే ద్వారకకు వెళ్లడానికి ముందే శిశుపాలుడు, అతని తమ్ముడు దంతవకలను హతమార్చాడు. ద్వారకకు వెళ్లిపోయే ముందు రెండు నెలల పాటు బృందావనానికి వచ్చి అక్కడ గోపికలతో గడిపి తిరిగి వెళ్లిపోయాడు. ద్వారకకు వెళ్లిన తరువాతే కృష్ణుడు రుక్మిణి సహా 8 మంది భామలను వివాహం

చేసుకున్నాడు. ద్వారకలో ఆయన గడిపింది 96 సంవత్సరాల 8 నెలలు. కృష్ణుడి 90 సంవత్సరాల వయసులో అంటే క్రీస్తుపూర్వం 3138లో కురుక్షేత్ర యుద్ధం జరిగింది. యుద్ధం ముగిసేనాటికి ఆయన వయస్సు 89 సంవత్సరాల రెండు నెలల ఏడు రోజులు. అంటే మహాభారత యుద్ధం ముగిసింది క్రీస్తుపూర్వం 3138 సెప్టెంబర్ 26న. ఆ తరువాత మరో 35 సంవత్సరాల పాటు బలరామ కృష్ణులు ఈ భూమ్మీద ఉన్నారు. క్రీస్తుపూర్వం 3102 ఫిబ్రవరి 18 శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల 27 నిమిషాల 30 సెకన్లకు కృష్ణుడు శరీరాన్ని విడిచిపెట్టి తన లోకానికి వెళ్లిపోయాడు. ఆర్కియాలజిస్టులు మన దేశంలో ఉండి నిర్ధారించిన అంశాలివి. ప్రపంచంలో ప్రాచీన చరిత్రను, సంస్కృతిని, నాగరికతను శిథిలాల ద్వారా, వాటి డిఎన్ఏల ద్వారా నిర్ధారించటానికి ఆర్కియాలజీ పద్ధతులు శాస్త్రీయంగా ఉన్నాయి. వాటినే ఉపయోగించి వాళ్లు చెప్పిన అంశాలే ఇవి. ఇవన్నీ రికార్డెడ్ వర్షన్స్ కూడా ఉన్నాయి.మన కల్చర్‌ను నమ్మక పోవటం.. తర్కానికి అందటం లేదంటూ అందంగా వ్యాఖ్యానించటం జనరల్‌గా ఓ ఫ్యాషన్. ఇప్పటికైనా మన మూలాలను తెలుసుకుని అవగాహన చేసుకునే ప్రయత్నం చేయాలన్న అవసరాన్ని గుర్తిస్తే ఈ తరానికిమొంచిది.

ధర్మ పరిరక్షణే ధ్యేయంగా..
సంస్కృతిని కాపాడే లక్ష్యంగా..
మన ఔన్నత్యాన్ని పెంచేలా..
మన ఔచిత్యాన్ని చాటేలా..
తెలుగు చరిత్రలోనే తొలిసారి..
ధర్మం కోసం అక్షర తపస్సు చేస్తూ..
తెలుగు ప్రజల కోసం వస్తున్నది..

"ఋషి తెలుగు దినపత్రిక"

'కురుక్షేత్రం' అన్న పేరుతో..
సంపాదకీయాన్ని తీసుకొస్తున్నది
ఆసక్తి కలిగిన రచయితలు..
ధర్మ పరిరక్షకులు..
ఈ అక్షర యజ్ఞంలో
పాలుపంచుకోవాలని విజ్ఞప్తి.
కురుక్షేత్రం పేజీ కోసం తమ
వ్యాసాలు పంపి
మరింత మందికి జ్ఞానాన్ని
ప్రసాదించాలని వినతి.

కాపాడుకుందాం
మన దేశాన్ని!
మన ధర్మాన్ని!!

OWNED, PUBLISHED AND PRINTED BY **TIRUMALASHETTY RAMACHANDRA RAO**, PRINTED AT VAIBHAV ART PRINTERS, #11-5-419, RED HILLS, LAKADIKAPOOL, HYDERABAD500004, TELANGANA, PUBLISHED AT 6-1-628/4/7, MARKET ROAD, KHIRATABAD, HYDERABAD-4, TELANGANA EDITOR : **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NUMBER: APTEL/2008/26409, CELL: 9666711515, EMAIL: rhushinews@gmail.com